శుక్రవారం
13 సెప్టెంబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 127
పేజీలు : 6
వెల : 3/-

Website: www.subhatelangana.in


RNI-TELTEL/2017/72695

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar



## సీపీఎం నేత సీతారాం ఏచూరి కన్నుమూత

- కొంతకాలంగా తీవ్ర శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఏచూరి
- 2015లో సీపీఎం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్ కారత్ నుంచి ఆయన బాధ్యతలు
- నేషనల్ ఫ్రంట్ , యునైటెడ్ ఫ్రంట్ కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ఏచూరి కీలక పాత్ర
- సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని ఎయిమ్స్ కు దానం చేసిన కుటుంబ సభ్యులు
- వైద్య విద్యార్థులకు బోధనలో భౌతికకాయం ఉపయోగించుకోవాలన్న కుటుంబం
- ఓ ప్రకటన ద్వారా వెల్లడించిన ఢిల్లీ ఎయిమ్స్

# రచ్చ.. రచ్చ!

- అరెకపూడి, కౌశిక్ రెడ్డి మధ్య జెండా జగడం
- పార్టీ ఫిరాయింపులపై ఇద్దరి మధ్య మాటల యుద్ధం
- గాంధీ ఇంటికెళ్లి బీఆర్ఎస్ జెండా ఎగరేస్తానన్న కౌశిక్.. ఆయన విల్లాకు వెళ్లిన గాంధీ, ఆయన అనుచరులు
- టమాటాలు, కోడిగుడ్లతో దాడి, కిటికీలు, కుండీలు ధ్వంసం.. ప్రతిగా చెప్పులు విసిరిన బీఆర్ఎస్ కార్యకర్తలు
- గంటన్నరపాటు హైటెన్షన్.. గాంధీ అరెస్టు, విడుదల.. సైబరాబాద్ కమిషనరేట్‌కు హరీశ్, కౌశిక్.. ఫిర్యాదు
- గాంధీపై కేసు నమోదు చేయాలని బైఠాయింపు.. వారిని అరెస్టు చేసి కేశంపేట తీసుకెళ్లి వదిలిన పోలీసులు



శుభ తెలంగాణ హైదరాబాద్

పార్టీ ఫిరాయింపుపై రచ్చ రచ్చ! ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం! ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంటికి పార్టీ మారిన మరో 'బీఆర్ఎస్' ఎమ్మెల్యే! అక్కడ హై టెన్షన్ వాతావరణం! ఆయన అరెస్టు.. విడుదల! సీనులోకి మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు! సైబరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయం వద్దా తీవ్ర ఉద్రిక్తత! అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులు! వెరసి.. ఫిరాయింపులు, 'జెండా వివాదం' ఎమ్మెల్యేల మధ్య తీవ్రస్థాయి లొల్లికి దారి తీసింది! శేరిలింగంపల్లి రణరంగంగా మారింది. ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా ఇటీవల శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించిన విషయం తెలిసిందే. అయితే, ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన ఆ పదవిని బీఆర్ఎసకు - మిగతా3లో



## తెలంగాణ బిడ్డలపై సర్కార్ కక్ష

- 'స్థానికత'పై సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైద్యారోగ్య శాఖ
- జీవో-33పై మొండిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్ర విద్యార్థులకు నష్టం కలుగకుండా చూడాలన్న హైకోర్టు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో వేలాది మంది విద్యార్థులు ఆగం
- నిలిచిపోయిన ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ

శుభ తెలంగాణ హైదరాబాద్

డాక్టర్ కల సాకారం చేసుకోవానుకుంటున్న తెలంగాణ బిడ్డలపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నది. 'స్థానికత' నిర్ధారణలో వైద్యారోగ్య శాఖ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెడుతున్నది. కనీస అధ్యయనం లేకుండా హడావుడిగా జీవో 33ని తీసుకొచ్చి - మిగతా3లో



## వివాదానికి పరిష్కారం లభిస్తేనే సంబంధాలు మెరుగుపడతాయి

- భారత్-చైనా సంబంధాలపై విదేశాంగ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు
- బలగాల ఉపసంహరణకు సంబంధించిన సమస్యలు 75 శాతం పూర్తయ్యాయని వ్యాఖ్య
- సరిహద్దులో చైనా సైనికీకరణ పెరుగుతుండడమే అతిపెద్ద సవాలన్న జైశంకర్
- జెనీవాలో జరిగిన 'జెనీవా సెంటర్ ఫర్ సెక్యూరిటీ పాలసీ'లో మాట్లాడిన విదేశాంగ మంత్రి



## పట్టపగలే ఎమ్మెల్యేపై హత్యాయత్నామా

- ఇందిరమ్మ రాజ్యం అంటే.. ఎమ్మెల్యేలకు కూడా రక్షణ లేకపోవడమేనా?: కేటీఆర్
- ఫ్యాక్షన్, రౌడీ రాజకీయాలకు తెలంగాణను అడ్డాగా మార్చేస్తుంటే బాధగా ఉంది

## ప్రభుత్వానిదే బాధ్యత



- మెడికల్ అడ్మిషన్లకు స్థానికతపై సుప్రీంకు తెలంగాణ సర్కార్
- స్థానికులకు స్థానిక కోటా సీట్లు దక్కేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- దాంతో రూల్స్ సవరించాం
- తెలంగాణ శాశ్వత నివాసితులకే స్థానిక రిజర్వేషన్ దక్కడం రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయం
- ఈ నిబంధనను కొట్టివేస్తే.. తెలంగాణ రాష్ట్రంలో వైద్య విద్య ప్రవేశాలకు దేశంలోని ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా అర్హులవుతారు. ఇక్కడి శాశ్వత నివాసితులకు స్థానిక రిజర్వేషన్ దక్కకుండా పోతోంది.

శుభ తెలంగాణ ఢిల్లీ

మెడికల్ అడ్మిషన్లకు స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తెలంగాణ శాశ్వత నివాసులు రాష్ట్రం బయట చదువుకున్నంత మాత్రాన స్థానిక రిజర్వేషన్ వర్తించదన్న ప్రభుత్వ నిబంధనను కొట్టివేస్తూ ఇటీవల తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణలో చదువుకోలేదన్న కారణంతో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించరాదని - మిగతా3లో

# రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదు




- తెలంగాణలో ఉపఎన్నికలపై టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు
- ఒకవేళ వచ్చినా కాంగ్రెస్ ఖాతాలోనే చేరుతాయి
- రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయబోతున్నాం
- బాధ్యతలు చేపట్టాక కొత్త కార్యవర్గంపై అధిష్టానంతో చర్చలు జరుపుతా
- కమిటీల్లో అన్ని సామాజికవర్గాలకు సముచిత ప్రాధాన్యత

శుభ తెలంగాణ న్యూఢిల్లీ

తెలంగాణలో ఉపఎన్నికలు రాబోతున్నాయంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒకవేళ వచ్చినా కాంగ్రెస్ ఖాతాలోనే చేరుతాయని టీపీసీసీ చీఫ్ తేల్చిచెప్పారు. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేను మహేష్ కుమార్ కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 60 ఏళ్ళ రాజకీయాల్లో - మిగతా3లో




## రాహుల్ గాంధీ దేశాన్ని వదిలి వెళ్లిపోవాలి

- రాహుల్ గాంధీ మాట్లాడే మాటలను సంఘ విద్రోహ శక్తులు సమర్థిస్తుంటాయన్న బీజేపీ నేత
- ఉగ్రవాద సంస్థలకు, రాహుల్ గాంధీకి ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అని నిలదీత
- హైడ్రా పేరుతో నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం
- ప్రజా పాలన దినోత్సవం కాదని... విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని డిమాండ్
- బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి అస్సలు తేడా లేదు

# సీపీఎం నేత సీతారాం ఏచూరి కన్నుమూత

**న్యూఢిల్లీ:** కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి కన్నుమూశారు. ఆయన వయసు 72 ఏళ్లు. సీపీఎం ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ ఎంపీ అయిన ఏచూరి.. ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యశాలలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు కొన్ని రోజుల నుంచి అక్కడే చికిత్స చేపడుతున్న విషయం తెలిసిందే. శ్వాసకోస సమస్యతో బాధపడుతున్న ఏచూరి ఇవాళ మరణించినట్లు ఆ పార్టీ ప్రకటించింది.

ఆగస్టు 19వ తేదీన ఎయిమ్స్ ఎమర్జెన్సీ వార్డులో ఆయన్ను చేర్పించారు. ఆ తర్వాత ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు మార్చారు. 2015లో సీపీఎం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్ కారత్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పార్టీ నేత హరికిషన్ సింగ్ సుర్జీత్ వద్ద ఏచూరి ఎదిగారు. వీపీ సింగ్ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్ , యునెటెడ్ ఫ్రంట్ కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ఏచూరి కీలక పాత్ర పోషించారు. ఆ సమయంలో ప్రభుత్వానికి సీపీఎం బయటి నుంచి మద్దతు ఇచ్చింది. తొలిసారి ఏర్పడ్డ యూపీఏ ప్రభుత్వానికి కూడా లెఫ్ట్ పార్టీలు మద్దతు ఇచ్చాయి. ఆ సమయంలోనూ ఏచూరి కీలక పాత్రను పోషించాడు. పాలసీ మేకింగ్‌లో కాంగ్రెస్ పార్టీపై ఆయన వత్తిడి తీసుకొచ్చారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ)లో ఆయన 1974లో చేరారు. ఆ తర్వాత ఏడాదే ఆయన పార్టీ సభ్యుడిగా మారారు. ఎమర్జెన్సీ సమయంలో అతన్ని అరెస్టు చేశారు.


సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని ఎయిమ్స్ కు దానం చేసిన కుటుంబ సభ్యులు

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నేడు కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ తో బాధపడుతున్న ఆయన... ఈ మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. కాగా, ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు ఎయిమ్స్ (ఆలిండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)కు దానం చేశారు. వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల బోధన, రీసెర్చ్ లో ఏచూరి భౌతికకాయాన్ని ఉపయోగించుకోవాలని కుటుంబ సభ్యులు ఎయిమ్స్ ను కోరారు. ఈ విషయాన్ని ఢిల్లీ ఎయిమ్స్ ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది.

**విద్యార్థి నేతగా రాజకీయాల్లోకి..**

**ఏచూరి జీవిత విశేషాలు**

వెబ్ డెస్క్: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి(72) కన్నుమూశారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. 32 ఏళ్లుగా సీపీఎం



పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్న ఏచూరి 2015లో ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 2005 - 2017 వరకు బెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు.

**బాల్యం..**


ఆయన పూర్తిపేరు ఏచూరి సీతారామరావు. 1952 ఆగస్టు 12 చెన్నైలో వైదేహి బ్రాహ్మణులైన సర్వేశ్వర సోమయాజులు ఏచూరి,కల్పకం దంపతులకు జన్మించారు. తండ్రి సర్వేశ్వర సోమయాజులు ఏమారి ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ కార్పొరేషన్లో ఇంజినీర్‌గా పని చేశారు. తల్లి కల్పకం ఏచూరి ప్రభుత్వ అధికారిణిగా ఉండేవారు. ఏచూరి బాల్యం ఎక్కువగా హైదరాబాద్‌లోనే సాగింది. భాగ్యనగరంలోని అల్ సెయింట్స్ హైస్కూల్లో ఆయన మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. అనంతరం ఢిల్లీకి వెళ్లి ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్లో చేరారు. 1970లో సీబీఎస్సీ సెకండరీ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంకర్‌గా నిలిచారు. సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఎకనామిక్స్‌లో బీఏ పూర్తి చేశారు. జేఎన్‌యూ నుంచి ఎంఏ పట్టా పొందారు. అనంతరం అక్కడే పీహెచ్‌డీలో చేరారు. అయితే అప్పటికే దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించడం.. ఏచూరిని అరెస్ట్ చేయడంతో పీహెచ్‌డీ కొనసాగించలేకపోయారు.

**దాంపత్య జీవితం..**

సీతారం ఏచూరి రెండు వివాహాలు చేసుకున్నారు. ఆయన మొదటి భార్య ఇంద్రాణి మజుందార్ కాగా.. జర్నలిస్టు సీమా చిత్తీ రెండో భార్య. ఏచూరి రెండో భార్య సీమా చిస్తీ జర్నలిస్టు. తన భార్య తనకు ఆర్థికంగా సహకరిస్తుందని ఏచూరి ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. మొదటి భార్యకు ఒక కుమార్తె, కుమారుడు సంతానం. అయితే కుమారుడు ఆశిష్.. 2021 ఏప్రిల్ 22న కొవిడ్‌తో మరణించారు.

**రాజకీయ రంగ ప్రవేశం ఇలా..**

తప్పు జరిగితే సహించలేని మనస్థత్వం ఏచూరిది. అందుకే




చిన్నప్పటి నుంచే రాజకీయాల్లోకి రావాలనే కుతూహలం ఉండేది. విద్యార్థిగా ఉన్నప్పుడే ఎస్ఎఫ్ఐ నేతగా 1974లో సీతారాం ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. 1975లో జేఎన్‌యూ విద్యార్థిగా ఉన్నప్పుడు కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులై సీపీఎంలో చేరారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ బాధితుల్లో ఏచూరీ కూడా ఒకరు. ఎమర్జెన్సీ సమయంలో ఆయన్ని పోలీసులు అరెస్ట్ చేశారు. జేఎన్‌యూ విద్యార్థి సమాఖ్యకు ఏచూరి మూడుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరాత్తో కలిసి జేఎన్‌యూను వామపక్షాలకు కంచుకోటగా మార్చారు. అనంతరం ఎస్ఎఫ్ఎస్ఐ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. 1984లో సీపీఎం కేంద్ర కమిటీలో చేరారు. 1990లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, 2005లో వెస్ట్ బెంగాల్ నుంచి తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2015లో విశాఖపట్నంలో జరిగిన 21వ సీపీఎం మహాసభల్లో పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేరళ విప్లవ సూర్యుడు వీఎస్ అచ్యుతానందన్‌కి ఏచూరి అత్యంత సన్నిహితుడు.

**ప్రస్తుత రాజకీయాల్లో..**

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక రాజకీయాల ముఖస్వరూపం మారిపోయింది. అయితే ప్రస్తుత రాజకీయాలకు కావాల్సిన నాయకత్వ లక్షణాలను అలవర్చుకుంటూ ఏచూరి ఎదుగుతూ వచ్చారు. కొన్నిసార్లు కేంద్ర ప్రభుత్వం నిర్ణయాల్లో కీలకంగా ఉన్నారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ ముసాయిదాను రూపొందించడంలో మాజీ కేంద్ర మంత్రి చిదంబరంతోపాటు ఏచూరి కీలక భూమిక పోషించారు. 2004లో అప్పటి యూపీఏ సర్కార్ నిర్మాణంలోనూ ఏచూరిది ప్రముఖ పాత్ర అని చెప్పుకోవచ్చు.

## ఆర్ జీ కర్ ఆసుపత్రిలో బ్యాగ్ కలకలం..

# ప్రభుత్వంతో జూనియర్ డాక్టర్ల చర్చలు

**కోల్‌కతా :** ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి ప్రాంగణంలో గురువారం ఓ బ్యాగ్ కలకలం సృష్టించింది. సదరు బ్యాగ్‌ను ఎవరు తీసుకు వెళ్లక పోవడంతో ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో జాగిలాలతో సహా పోలీసులు ఆర్ జీ కర్ ఆసుపత్రికి చేరుకున్నారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలోని బ్యాగ్‌ను తనిఖీ చేశారు. అయితే ఈ బ్యాగ్‌లో ఏమి లేకపోవడంతో ఆసుపత్రి సిబ్బందితోపాటు రోగులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆసుపత్రిలోని రోగులను బయటకు పంపారు. ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రెయినీ వైద్యురాలు హత్యాచారానికి గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని.. అలాగే వైద్య రంగాన్ని ప్రక్షాళణ చేయాలంటూ జూనియర్ వైద్యులు దాదాపు నెలకు పైగా ఆందోళన చేపట్టారు. ఆ క్రమంలో వారితో చర్చించేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఈ రోజు సాయంత్రం అంటే.. సెప్టెంబర్ 12వ తేదీ సాయంత్రం 5.00 గంటలకు జూనియర్ డాక్టర్లతో ప్రభుత్వం చర్చలు జరపనుంది. అయితే జూనియర్ వైద్యులు డిమాండ్లలో కొన్నింటిని ప్రభుత్వం పక్కన పెట్టింది. సీఎం మమతా బెనర్జీ సమక్షంలో చర్చలు జరిగేందుకు సానుకూలంగా స్పందించింది. అలాగే ఈ చర్చలకు కేవలం 15 మంది మాత్రమే రావాలని షరతు విధించింది. ఈ




చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేయాలంటూ జూనియర్ వైద్యుల చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం తొసి పుచ్చింది. కానీ ఈ చర్చలను మాత్రం రికార్డ్ చేస్తామని స్పష్టం చేసింది. అదికూడా పారదర్శకత కోసమేనని ఆ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ తెలిపారు. ఈ మేరకు జూనియర్ వైద్యులకు రాసిన లేఖలో ఈ అంశాలను ఆయన పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీ ఏ సమయంలో ఏం మాట్లాడతారో ఆయనకే తెలియదు : ప్రశాంత్ కిషోర్

అమెరికా పర్యటనలో కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటనపై జన్ సురాజ్ చీఫ్, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఏ సమయంలో ఏం మాట్లాడతారో ఆయనకే తెలియదని అన్నారు. కొద్ది నెలల కిందట కుల గణనకు అనుకూలంగా మాట్లాడిన రాహుల్ రిజర్వేషన్లను పెంచాల్సిన అవసరం ఉందని అన్నారని గుర్తుచేశారు. అయితే అమెరికా పర్యటనలో రాహుల్ ప్రస్తుతం రిజర్వేషన్లు తొలగించడం గురించి మాట్లాడుతున్నారని అన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసేవరకూ రాహుల్ నిత్యం కుల గణన చేపట్టాలని, అవసరమైతే కోటా పరిమితిని పెంచాలని అన్నారని, ఇప్పుడాయన ఎందుకు రిజర్వేషన్లు తొలగించాలని మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని ప్రశాంత్ కిషోర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాహుల్ ప్రకటనపై కాంగ్రెస్ నేతలు వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ దినేష్ శర్మ గురువారం స్పందించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భారత్ ఎకానమీ ప్రపంచంలో 11వ స్థానంలో ఉండగా ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద 5వ ఎకానమీగా ఎదిగిందని అన్నారు.

## ఇంకెంతకాలం కళ్లు మూసుకుని ఉంటారు?

**ఢిల్లీ :** బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అత్యాచార ఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నా ఆ పార్టీ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని లోక్ సభపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో ట్రైనీ ఆర్మీ మహిళపై జరిగిన అత్యాచార ఘటనను ఉద్దేశిస్తూ ఆయన ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. "ట్రైనీ ఆర్మీ అధికారులపై దాడి, వారి స్నేహితురాలిపై అత్యాచారం సమాజాన్ని సిగ్గుపడేలా చేసింది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో శాంతిభద్రలు కరవయ్యాయి. మహిళలపై రోజురోజుకు పెరుగుతోన్న నేరాలపట్ల బీజేపీ ప్రదర్శిస్తోన్న ప్రతికూల వైఖరి ఆందోళన కలిగిస్తోంది. అధికార యంత్రాంగం వైఫల్యం వల్లే నేరస్థులు ఇలాంటి పనులకు పూనుకుంటున్నారు. ఈ నేరాలు అమ్మాయిల స్వేచ్ఛ, ఆకాంక్షలకు అడ్డంకిగా మారతాయి. దేశ జనాభాలో సగ భాగమైన ఆడపిల్లలపై ఇలాంటి ఘటనలు జరుగుతున్నా.. ఇంకా ఎంతకాలం కళ్లుమూసుకొని ఉంటారు" అని రాహుల్ ప్రశ్నించారు.


**ఏం జరిగిందంటే..**

మధ్యప్రదేశ్‌కు చెందిన ఆర్మీ అధికారులు మోవ్ ఆర్మీ కాలేజీలో శిక్షణ పొందుతున్నారు. అధికారులు ఇద్దరూ మధ్యాహ్న సమయంలో మహిళా స్నేహితులతో కలిసి ఛోటీ జామ్‌లోని ఫైరింగ్ రేంజ్‌కు వెళ్లారు. అయితే వారిని అకస్మాత్తుగా 8 మంది వ్యక్తులు పిస్టల్స్, కత్తులు, కర్రలతో చుట్టుముట్టారు. డబ్బు, నగలు, వస్తువులు దోచుకోవడానికి వచ్చిన దుండగులు ఇద్దరు ట్రైనీ అధికారులను దారుణంగా కొట్టారు. ఒక ఆఫీసర్‌ని, ఒక మహిళను బందీలుగా మార్చుకున్న



దుండగులు.. మరో అధికారిని, ఒక మహిళను వదిలిపెట్టి రూ.10 లక్షలు తీసుకొచ్చి బందీలుగా ఉన్నవారిని విడిపించుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో వారి చెర నుంచి బయటపడ్డ ఆర్మీ అధికారి వేగంగా తన ఆర్మీ యూనిట్ వద్దకు వెళ్లి విషయాన్ని కమాండింగ్ అధికారికి చెప్పారు. ఇదే సమయంలో డయల్-100 ద్వారా పోలీసులకు కూడా సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన పోలీసులు, సైనిక అధికారులు ఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. అయితే వాహనాలను ముందుగానే గమనించిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులు నలుగురినీ వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు ఆర్మీ అధికారులకు గాయాలు అయ్యాయని వైద్యులు తెలిపారు. ఒక మహిళపై అత్యాచారం జరిగినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయినట్టు బద్గొండ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ లోకేంద్ర సింగ్ హిరోర్ చెప్పారు.

## వివాదానికి పరిష్కారం లభిస్తేనే సంబంధాలు మెరుగుపడతాయి



చైనాతో సంబంధాలు, సరిహద్దు వివాదంపై విదేశాంగ మంత్రి జైశంకర్ గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. స్విట్జర్లాండ్ రాజధాని జెనీవా సెంటర్ ఫర్ సెక్యూరిటీ పాలసీ ఇంటరాక్టివ్ సెషన్‌లో మాట్లాడారు. చైనాతో దాదాపు 75శాతం సమస్యలు పరిష్కామయ్యాయని.. సరిహద్దుల్లో సైనికీకరణ పెరగడం పెద్ద సమస్యగా అభివర్ణించారు. జూన్ 2020లో గాల్వాన్ వ్యాలీలో జరిగిన ఘర్షణలు భారత్-చైనా సంబంధాలను ప్రభావితం చేశాయన్నారు. సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు ఇరుపక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని.. కొంత వరకు పురోగతి సాధించామని చెప్పారు. బలగాల ఉపసంహారణకు సంబంధించిన సమస్యలు 75 శాతం పరిష్కారం అయ్యాయని తాను చెప్పగలనని.. చేయాల్సిన పనులు కొన్ని ఉన్నాయని ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. వివాదాన్ని పరిష్కరించుకుంటే సంబంధాలు మెరుగుపడుతాయ్నారు. పరిష్కారం దొరికితే శాంతి, సామరస్యం నెలకొంటుందని.. ఆ తర్వాత ఇతర అవకాశాలను సైతం పరిశీలించవచ్చన్నారు. తూర్పు లడఖ్‌లోని పలుచోట్ల భారత్ %-% చైనా మధ్య ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. అయితే, రెండువైపులా విస్తృతమైన దౌత్య, సైనిక చర్చల తర్వాత అనేక ప్రాంతాల నుంచి బలగాలను ఉపసంహరించారు. అదే సమయంలో రాబోయే రోజుల్లో అమెరికాలో క్వాడ్ సమ్మిట్ జరుగుతుందని భావిస్తున్నామని, కాలం గడుస్తున్న కొద్దీ ఇండో-పసిఫిక్‌లోని చాలా ప్రాంతాల్లో విశ్వాసం పెరుగుతోందని జైశంకర్ పేర్కొన్నారు. "చర్చలు కొనసాగుతున్నాయి. కొంత మేర మేము పురోగతిని సాధించాం. చేయాల్సిన పనులు కొన్ని ఉన్నాయి" అని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన స్పందించారు. సరిహద్దులో సైనికీకరణ సమస్యను పరిష్కరించాలని భావించామని, అయితే ఈలోగా గాల్వాన్ ఘర్షణ జరగడంతో మొత్తం సంబంధాలు ప్రభావితం అయ్యాయని అన్నారు. వివాదానికి పరిష్కారం లభిస్తేనే సంబంధాలు మెరుగుపడతాయని జైశంకర్ వ్యాఖ్యానించారు. సమస్యకు పరిష్కారం లభించి శాంతి నెలకొంటే తాము ఇతర అవకాశాలపై దృష్టిసారిస్తామని చెప్పారు.

## లాలూ ప్రసాద్ యాదవ్‌కు యాంజియోప్లాస్టీ చేసిన ముంబయి వైద్యులు..



బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. లాలూ గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ ముంబయిలోని ఓ ఆసుపత్రిలో చేరారు. యాంజియోప్లాస్టీ చేయించుకోవాలని కార్డియాలజిస్టులు మాజీ సీఎంకు సూచించగా ఆయన అంగీకరించారు. ఈ క్రమంలో గురువారం వైద్యులు యాంజియో ప్లాస్టీ చేశారు. లాలూ గత కొంతకాలంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడు తున్నారు. గతంలో ఆయన సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి చేయించుకున్న విషయం తెలిసిందే. ఆయన కుమార్తె కిడ్నీ దానం చేసిన విషయం తెలిసిందే. లాలూ ప్రసాద్ యాదవ్ ల్యాండ్ ఫర్ స్కామ్, దాణా కుంభకోణం కేసుల్లో బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆ తర్వాత ఆరోగ్య సమస్యలతో ఆయన నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ నెల 10న ఆయన ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైద్య పరీక్షల తర్వాత ఒకటి, రెండురోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని ఆసుపత్రివర్గాలు తెలిపాయి. 2014లో లాలూకు ఇదే ఆస్పత్రిలో అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీ జరిగింది. 2018, 2023 అదే ఆసుపత్రిలో పరీక్షల కోసం వచ్చారు. సతోష్ దొరా నేతృత్వంలోని వైద్యబృందం చికిత్స అందిస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. నవంబర్ 2022లో లాలూ కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. ఆయనకు కూతురు రోహిణి కిడ్నీ దానం చేశారు. రోహిణి సింగపూర్‌లో నివాసం ఉంటున్నారు. చాలాకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో పోరాడుతుండగా.. నిపుణుల సూచన మేరకు కిడ్నీ మార్పిడికి ఆయన అంగీకరించారు. కూతురు రోహిణి కిడ్నీ సరిపోలడంతో సింగపూర్‌లోనే కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు.

## సీజేఐ ఇంట ప్రధాని మోదీ.. రేగిన వివాదం



**న్యూఢిల్లీ :** న్యూఢిల్లీలోని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి. వై. చంద్రచూడ్ నివాసంలో జరిగిన గణపతి వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. దీనిపై మహారాష్ట్రకు చెందిన శివసేన పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ స్పందించారు. సీజేఐ ఇంటికి ప్రధాని మోదీ వెళ్లడంతో న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంపై ప్రజల్లో సందేహాలు వ్యక్తమయ్యే అవకాశముందని ఆయన వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకుడితో రాజ్యాంగ సంరక్షకుడు సమావేశం కావడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తుందన్నారు. ఈ వ్యాఖ్యలతో సీజేఐ నివాసానికి ప్రదాని మోదీ వెళ్లడం వివాదాస్పదంగా మారింది. శివసేన ఎంపీ వ్యాఖ్యలపై బీజేపీ స్పందించింది. గణపతి పూజా వేడుకల్లో మాత్రమే ప్రధాని మోదీ పాల్గొన్నారని స్పష్టం చేసింది. ఇది మన సంస్కృతిలో భాగమని ఈ సందర్భంగా వివరించింది. ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని నిజమైన శివసేన పార్టీగా గుర్తిస్తూ మహారాష్ట్ర స్పీకర్ నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఉద్దవ్ ఠాక్రే శిబిరం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ విచారణకు వచ్చే సమయంలో సుప్రీంకోర్టు ధర్మాసనం నుంచి తప్పుకోవాలని సీజేఐకి ఎంపి ఏకనాథ్ షిండే సూచించారు. అంతేకాదు.. ప్రతిపక్షాలను వ్యతిరేకంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల జాబితాను తన ఎక్స్ ఖాతాలో ఆయన పోస్ట్ చేశారు. అందులో కోల్‌కతాలోని ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారం, మద్యం కుంభకోణం మనీల్యాండరింగ్ వ్యవహారంలో అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అంశాలను సైతం పొందు పరిచారు. ఈ కేసులన్నీ వరుస క్రమంలో ఓ పద్ధతి ప్రకారం అర్థం చేసుకుంటే అన్ని అర్థమవుతాయన్నారు. ఇదే అంశంపై శివసేన ఎంపీలు ప్రియాంక చతుర్వేది, మిలింద్ దేవరలు సైతం కాస్త ఘాటు స్పందించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ నివాసంలో జరిగిన వినాయక చవితి వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. మహారాష్ట్ర సంప్రదాయం ప్రకారం టోపీ ధరించి ప్రధాని మోదీ ఈ వేడుకలకు హాజరయ్యారు. అందుకు సంబంధించిన ఫోటోలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతా వేదికగా పోస్ట్ చేశారు. ఈ వేడుకలకు విచ్చేసిన ప్రధాని మోదీని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దంపతులు సాదరంగా ఆహ్వానించారు.

# రచ్చ.. రచ్చ!

-మొదటిపేజీ తరువాయి

రాజీనామా చేసి కొన్ని రోజుల కిందట కాంగ్రెసలో చేరిన గాంధీకి ఎలా ఇస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బుధవారం తీవ్రంగా స్పందించారు. "పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం ఉంటే స్పీకర్ నిర్ణయానికి ముందే రాజీనామా చేయాలి. లేదంటే ఆ పది మందికి చీరలు, గాజులు కొరియర్ చేస్తా.. వేసుకొని తిరగండి" అని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెసలో చేరినట్లు అప్పట్లో స్వయంగా చెప్పిన గాంధీ ఇప్పుడు దేవుడి కండువా కప్పుకొన్నానని మాట మారుస్తున్నాడని, ఆయన తమ పార్టీ సభ్యుడే అయితే తెలంగాణ భవన్‌కు రావాలని డిమాండ్ చేశారు. లేకపోతే, గురువారం ఉదయం 11 గంటలకు ఆయన ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ కండువా కప్పుతానని, ఆయన ఇంటిపై పార్టీ జెండా ఎగురవేసి, తెలంగాణ భవన్‌కు తీసుకెళ్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో, ఉదయం ఏడు గంటలకే కౌశిక్ ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయనను హౌజ్ అరెస్ట్ చేశారు.

### గేటును విరగ్గొట్టి.. తలుపులు నెట్టి..

తన ఇంటికి వచ్చి జెండా ఎగరేస్తానని కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించడంపై గురువారం ఉదయం అరెకపూడి గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. తన ఇంటి ముందు కుర్చీ వేసుకుని కూర్చుని మీడియాతో మాట్లాడారు. రాయలేని పదజాలంతో కౌశిక్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. "నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని అసెంబ్లీలో స్పీకర్ ప్రకటించారు. కౌశిక్ రెడ్డిలాంటి కోవర్టులకు నా గురించి మాట్లాడే అర్హత లేదు. 11 గంటలకు నా ఇంటికి వచ్చి జెండా ఎగుర వేస్తానన్నాడు. రాకపోతే 12 గంటలకు నేనే నీ ఇంటికి వస్తా. పార్టీలో చేరి భ్రష్టు పట్టించింది కాక పాత ముఖ్యమంత్రిని నాశనం చేశావు. కాంగ్రెస్ నుంచి కొంతమందిని తీసుకొచ్చి బీఆర్ఎసలో జాయిన్ చేస్తానని చెప్పావు. ఓ దుర్మార్గుడు నా ఇంటిపై జెండా ఎగరవేస్తానని అంటే ఊరుకుంటానా!? నా ఇంటిపై జెండా ఎగుర వేస్తానంటే ఎగుర వేయించుకునేందుకు సిద్ధంగా లేము. చేతులు కట్టుకుని కూర్చోలేదు. నువ్వో.. నేనో తేల్చుకుందాం.. ధైర్యం ఉంటే రా..! లేకపోతే నేనే వస్తా" అని సవాల్ విసిరారు. ఇది బీఆర్ఎసకు, తనకు మధ్య యుద్ధం కాదని, కౌశిక్‌కు తనకు మధ్యనని స్పష్టం చేశారు. ఎన్నికల్లో తనను గెలిపించకపోతే చనిపోతానని బ్లాక్ మెయిల్ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్ రెడ్డిలాంటి కోవర్టులకు తన గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. కేసీఆర్‌కే తాను సమాధానం చెబుతానని, కౌశిక్ వంటి ఇజ్జత్ లేని వాళ్లకు జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పది నిమిషాల్లో రాకపోతే తానే కౌశిక్ ఇంటికి వెళతానని అన్నారు. అన్నట్లుగానే మధ్యాహ్నం 12 గంటలకు 20 వాహనాల కాన్వాయ్‌లో తన అనుచరులతో కొండాపూర్‌లోని కొల్లా విల్లాసలో ఉంటున్న కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లారు. దీంతో, కౌశిక్ ఇంటి వద్ద భద్రతను మరింత పెంచారు. మధ్యాహ్నం 12.30 గంటలలోపు కౌశిక్ రెడ్డి ఇంటికి గాంధీ, ఆయన అనుచరులు చేరుకున్నారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇరు వర్గాల మధ్య తోపులాటలు, వాగ్వాదాలు జరిగాయి. కొంతమంది గేటును విరగ్గొట్టి, ప్రవేశ ద్వారానికి చెందిన తలుపులను తెరిచేందుకు ప్రయత్నించారు. విల్లాస్ బయట ఉన్న పెద్ద గేటును బద్దలు కొట్టి గాంధీ అనుచరులు లోపలికి వెళ్లారు. కానీ, వారు కౌశిక్ రెడ్డి దగ్గరకు వెళ్లనీయకుండా పోలీసులు కట్టడి చేశారు. అదే సమయంలో కౌశిక్, ఆయన అనుచరులపై గాంధీ అనుచరులు కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారు. కొంతమంది రాళ్లతో ఆయన ఇంటి కిటికీ అద్దాలు, పూలకుండీలు పగులకొట్టారు. దీనికి ప్రతిగా బీఆర్ఎస్ కార్యకర్తలు, కౌశిక్ రెడ్డి అనుచరులు వారిపై చెప్పులు విసిరారు. సైబరాబాద్ పోలీసులు ఎట్టకేలకు గాంధీని అరెస్ట్ చేసి నార్సింగి పోలీసు స్టేషన్‌కుతీసుకెళ్లారు. ఆ తర్వాత స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

### కౌశిక్ వర్సెస్ పోలీసులు

కౌశిక్ రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తూ మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, కౌశిక్ రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు వెళ్లారు. తన ఇంటిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలంటూ కౌశిక్ రెడ్డి సైబరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బెడ్‌రూం కిటికీ బద్దలు కొట్టి తనపై దాడికి యత్నం చేశారని ఆరోపించారు. దాడికి యత్నించిన గాంధీ, ఆయన అనుచరులపై హత్యాయత్నం, దోపిడీ వంటి కేసులు నమోదు చేయాలని కోరారు. ఆ సమయంలో ప్రేక్షక పాత్ర పోషించిన మాదాపూర్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. దీంతో, కౌశిక్ రెడ్డి, పోలీసుల నడుమ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అడ్డుకోబోయిన పోలీసులపైకి వేలెత్తి చూపిన కౌశిక్ రెడ్డి.. జాగ్రత్త అంటూ హెచ్చరించారు. వెంటనే కలగజేసుకున్న హరీశ్ రావు.. ఆయనను సముదాయించి పక్కకు పంపించారు. అనంతరం ఆయన పోలీసులతో మాట్లాడారు. గాంధీ అనుచరులపై హత్యాయత్నం కేసు పెట్టాలని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్ కాపీ ఇచ్చే వరకు ఇక్కడే ఉంటామని తేల్చి చెప్పారు. రాత్రి ఏడు గంటల వరకూ అక్కడే బైఠాయించారు. దాంతో, తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ కేసు నమోదు చేసిన పోలీసులు హరీశ్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, వివేకానందతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

### అర్ధరాత్రి హరీశ్ బైఠాయింపు

అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరలింపు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. దాదాపు మూడు గంటలపాటు రంగారెడ్డి జిల్లాలో హైడ్రామా నడిచింది. వారిని తొలుత నాటకీయ పరిణామాల మధ్య తలకొండపల్లికి.. అక్కడి నుంచి కేశంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమను ఇంత దూరం ఎందుకు తీసుకొచ్చారో చెప్పాలంటూ హరీశ్ తదితరులు పోలీసు స్టేషన్లోనే బైఠాయించారు. వివాదానికి కారకుడైన గాంధీపై కేసు పెట్టి అరెస్ట్ చేసే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించారు. కాగా, తోపులాటలో హరీశ్ భుజానికి గాయమైంది. ఆయన చెయ్యి నొప్పితో బాధపడుతున్నట్లు కనిపించింది. చివరకు, డీజీపీ హామీతో హరీశ్ ఆందోళన విరమించారు. కేశంపేట పోలీసు స్టేషన్ నుంచి విడుదలైన తర్వాత హరీశ్ విలేకరులతో మాట్లాడుతూ.. కౌశిక్ ఇంటిపై దాడి చేసిన వారిపై 307 కింద క్రిమినల్ కేసు పెడతామని డీజీపీ హామీ ఇచ్చారని, బేషరతుగా ఇంటికి వెళ్లాలని చెప్పారని, అందుకే ఆందోళన విరమించామని చెప్పారు. మరోవైపు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద, సంజయ్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మాజీ స్పీకర్ మధుసూదనాచారిలను మరో వాహనంలో తలకొండపల్లికి తీసుకొచ్చారు. అక్కడ భారీగా మోహరించిన బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేయడంతో 20 నిమిషాల అనంతరం తలకొండపల్లి నుంచి వారిని నగరం వైపు తీసుకెళ్లారు. బీఆర్ఎస్ శ్రేణులు అడుగడుగునా అడ్డుకోవడంతో అర్ధరాత్రి కేశంపేట, తలకొండపల్లిల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. షాద్‌నగర్ బైపాస్ మీదుగా కేశంపేట్ తరలిస్తుండగా ఎక్లాసఖాన్‌పేట వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు హరీశ్ ఉన్న పోలీస్ వాహనాన్ని అడ్డుకొని ఆందోళన చేశారు. రోడ్డుకు అడ్డుగా జేసీబీ పెట్టి పోలీసు వాహనాలను అడ్డుకున్నారు. వాహనం అద్దాలను పగులగొట్టారు.

### గాంధీ, అనుచరులపై కేసు నమోదు

కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి కేసులో గచ్చిబౌలి పోలీసులు ఎమ్మెల్యే గాంధీ, ఆయన అనుచరులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిలో గాంధీని ఎ-1గా పేర్కొన్నారు. గాంధీతోపాటు కార్పొరేటర్లు, కార్యకర్తలు 30 మందిపై కౌశిక్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నంబర్ 1392/2024 నమోదు చేశారు. 189, 191(2), 191(3). 61, 132, 329, 111, 324(4), 324(5), 351(2), ఆర్-డబ్ల్యూ 190 బీఎన్ఎస సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎ2గా మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్, ఎ3గా బి.గౌతంగౌడ్, ఎ4 రాంపల్లి వెంకటేష్, ఎ5 జి.రాములు, ఎ6 నరేష్, ఎ7 శివ, ఎ8 రాధిక, ఎ9 మంజుల, ఎ10 చంద్రికగౌడ్, ఎ11 కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, ఎ12 బి.వెంకటేష్ గౌడ్, ఎ13 అష్రఫ్, ఎ14 రఘునాథ్‌రెడ్డి, ఎ15 మోహన్ గౌడ్‌తోపాటు పలు వీడియోలు పరిశీలించి దాడిలో పాల్గొన్న పలువురిని గుర్తించి 30 మందిపై కేసు నమోదు చేశారు.. మారింది. ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా ఇటీవల శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించిన విషయం తెలిసిందే. అయితే, ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన ఆ పదవిని బీఆర్ఎసకు రాజీనామా చేసి కొన్ని రోజుల కిందట కాంగ్రెసలో చేరిన గాంధీకి ఎలా ఇస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బుధవారం తీవ్రంగా స్పందించారు. "పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం ఉంటే స్పీకర్ నిర్ణయానికి ముందే రాజీనామా చేయాలి.

# తెలంగాణ బిడ్డలపై సర్కార్ కక్ష

-మొదటిపేజీ తరువాయి

విద్యార్థులకు అన్యాయం చేసిన ప్రభుత్వం.. దాన్ని సవరించుకోవాల్సింది పోయి మొండిగా వ్యవహరిస్తున్నది. తెలంగాణ విద్యార్థులకు నష్టం కలుగకుండా స్థానిక కోటా కింద అవకాశం కల్పించాలని, ఈ మేరకు నిబంధనలు రూపొందించాలని హైకోర్టు సూచించినా ప్రభుత్వం చెవికి ఎక్కలేదు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కేసును వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద తెలంగాణ తరఫు న్యాయవాది ప్రతిపాదించారు. దీంతో త్వరగా విచారణకు తీసుకుంటామని సీజేఐ ధర్మాసనం తెలిపింది.

### ఎన్నిసార్లు మొత్తుకున్నా చెవికెక్కించుకోలే..

స్థానికతను నిర్ధారించడంలో ప్రభుత్వం మొదటి నుంచీ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. తెలంగాణ, ఏపీ మధ్య ఈ ఏడాది జూన్ 2తో 'ఉమ్మడి' బంధం శాశ్వతంగా ముగిసిపోతున్న నేపథ్యంలో స్థానికతను నిర్ధారించుకోవాలన్న సూచనలను ప్రభుత్వం పట్టించుకోలేదు. మెడికల్ సీట్లలో ఉమ్మడి కోటాపై నిర్ణయం తీసుకోవాలని, స్థానికతను నిర్ధారించాలని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ నుంచి ఈ ఏడాది జనవరిలోనే వైద్యారోగ్య శాఖ కార్యదర్శికి లేఖ రాసినట్టు చెప్తున్నారు. ఆ తర్వాత వైద్యశాఖ అంతర్గత సమావేశాల్లోనూ పలుమార్లు ఈ అంశం ప్రస్తావనకు వచ్చినా 'చూద్దాం లే' అన్న ధోరణిలో వ్యవహరించారు. 'స్థానికత'ను నిర్ధారించాలని ఇతర యూనివర్సిటీలు, సాంకేతిక విద్యాశాఖ నుంచి సైతం ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందాయి. కానీ పట్టించుకోలేదు. ఇంజినీరింగ్ ప్రవేశాల సమయంలోనూ ఉమ్మడి కోటాపై తర్జనభర్జనలు జరిగినా.. జూన్ 2వ తేదీకి ముందే అడ్మిషన్లు జరగడంతో కోటాను కొనసాగించారు. కానీ మెడికల్ సీట్లపై మాత్రం వైద్యారోగ్య శాఖ మీనమేషాలు లెక్కించింది. చివరికి పీకలమీదికి వచ్చిన తర్వాత జూలై 19న తూతూమంత్రంగా జీవో-33 ఇచ్చింది. వ్యతిరేకత వస్తుందన్న భయంతో జీవోను బహిర్గతం చేయకుండా రహస్యంగా ఉంచింది. రెండు వారాల తర్వాత అడ్మిషన్ల నోటిఫికేషన్‌తోపాటు విడుదల చేసింది. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు తెలంగాణలో చదివిన వారిని మాత్రమే 'స్థానికులు'గా గుర్తిస్తామని పేర్కొన్నది. దీంతో ఇతర రాష్ట్రాల్లో మంచి విద్యాసంస్థల్లో చదివినవారు, ఉద్యోగరీత్యా తల్లిదండ్రుల బదిలీలు, ఇతర కారణాల వల్ల ఇంటర్ వేరే రాష్ట్రంలో చదివిన తెలంగాణ విద్యార్థులు స్థానికేతరులుగా మారిపోయారు.

### న్యాయం చేయాలన్న కోర్టు.. పట్టించుకోని వైద్యశాఖ

జీవో 33ను రద్దు చేయాలంటూ హైకోర్టులో 53 వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నెల 5న తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో శాశ్వత నివాసం ఉంటున్న స్థానికులకు మెడికల్, డెంటల్ కాలేజీల్లో ప్రవేశాల్లో అవకాశం కల్పించాలని ఆదేశించింది. రాష్ట్రం బయట చదువుకున్నంత మాత్రాన స్థానికత వర్తించదనడం అన్యాయమని పేర్కొన్నది. ఒక విద్యార్థిని తెలంగాణ శాశ్వత నివాసిగా ఎలా గుర్తించాలో మార్గదర్శకాలు, నిబంధనలు లేవని గుర్తుచేసింది. హైకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే వైద్యారోగ్య శాఖ సమీక్షించి ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. కానీ.. అలా జరగకుండా దాదాపు వారం రోజులు వృథా చేసి, చివరికి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కోర్టు తీర్పు వచ్చే వరకు అడ్మిషన్ల ప్రక్రియ నిలిచిపోయినట్టేనని వైద్యశాఖ వర్గాలు చెప్తున్నాయి. కనీసం హైకోర్టు తీర్పు వచ్చిన ఒకటి రెండు రోజుల్లో సుప్రీంకోర్టును ఆశ్రయించినా.. ఇప్పటివరకు ఏదో ఒకటి తేలిపోయేదని అంటున్నారు. రాష్ట్రంలో వైద్యవిద్య ప్రవేశాలు, దవాఖానల్లో వసతులను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం గత నెల 16వ తేదీన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది. డీఎంఈ సభ్యకార్యదర్శిగా, డీఎంఈ (అకడమిక్), హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉన్నారు. తీర్పు వచ్చిన వెంటనే సమీక్షించకుండా టాస్క్‌ఫోర్స్ ఏం చేసిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఏపీ ముందుచూపు..

స్థానికత నిర్ధారణలో ఏపీ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలకు స్థానికత, రిజర్వేషన్లపై అధ్యయనం చేసేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఒక ప్రత్యేక కమిటీని నియమించింది. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి చైర్మన్‌గా, ఎనిమిది మంది ఉన్నతాధికారులు, అడ్మిషన్ల రంగంలో నిపుణులు ఒకరిని సభ్యులుగా కమిటీని ఏర్పాటుచేసింది. స్థానికత, ఉమ్మడి కోటా అంశంపై నిపుణులు, విద్యార్థులు, అసోసియేషన్ల నుంచి అభిప్రాయాలు తీసుకొని నివేదిక సమర్పించింది. ఈ మేరకు ఏపీలో స్థానికతను నిర్ధారించారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన ఎంబీబీఎస్, బీడీఎస్ నోటిఫికేషన్‌లో స్థానికతపై స్పష్టత ఇచ్చారు. వివిధ కారణాలతో స్థానికంగా ఇంటర్ చదవలేని వారికి 'ఏపీ నాన్‌లోకల్' స్టేటస్ ఇచ్చి, సీట్లలో కోటా ఇవ్వడంతో స్థానికతపై వివాదాలు తలెత్తలేదు.

## ప్రభుత్వానిదే బాధ్యత

-మొదటిపేజీ తరువాయి

హైకోర్టు ఆదేశాల్లో పేర్కొంది.
ఈ క్రమంలో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ కేసును వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద తెలంగాణ తరఫు న్యాయవాది మెన్షన్ చేశారు. త్వరగా విచారణకు తీసుకుంటామని సీజేఐ ధర్మాసనం వెల్లడించింది.

### తెలంగాణ హైకోర్టు తీర్పిదే...

కాగా... తొమ్మిదో తరగతి నుంచి వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివిన వాళ్లే.. రాష్ట్రంలో వైద్య విద్యకు స్థానిక కోటాలో అర్హులంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలపై హైకోర్టు గురువారం కీలక తీర్పునిచ్చింది. తెలంగాణలో శాశ్వత నివాసితులకు ఈ నిబంధన వర్తించదని పేర్కొంటూ.. 'తెలంగాణ మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్-2017'కు జీవో 33 ద్వారా ప్రభుత్వం తెచ్చిన సవరణ, రూల్ 3(ఏ)ని పునర్నిర్వచించింది. శాశ్వత నివాసులు కేవలం రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటే.. స్థానికులు కాకుండా పోబోరని అభిప్రాయపడింది. శాశ్వత నివాసులైన విద్యార్థులను గుర్తించి, వారికి మెడిసిన్ కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించాలని ఆదేశించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. తెలంగాణలో వైద్యవిద్యలో అడ్మిషన్లకు ప్రభుత్వం 2017లో నిబంధనలను రూపొందించింది. అయితే.. విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగియడంతో.. ఆ నిబంధనలకు సవరణలను తీసుకొస్తూ.. సర్కారు జూలై 19న జీవో 33ని తీసుకువచ్చింది. దీని ప్రకారం.. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు వరుసగా తెలంగాణలో చదివిన వాళ్లే స్థానికులు అని రూల్ 3(ఏ)లో నిర్వచించింది. అయితే.. ఇంటర్‌తోపాటు నీట్ కోచింగ్, ఇతరత్రా కారణాల వల్ల వేరే రాష్ట్రాల్లో చదివిన తెలంగాణ శాశ్వత స్థానికులైన విద్యార్థుల పాలిట ఈ నిర్వచనం శరాఘాతంగా మారింది. సొంత రాష్ట్రంలో స్థానికులు కాకుండా పోవడంపై 130 మందికి పైగా విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. 53 వేర్వేరు పిటిషన్లను దాఖలు చేశారు. "తెలంగాణ స్థానికులమే అయినా.. కేవలం ఒకట్రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదివినంత మాత్రాన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు కాంపిటెంట్ కోటాలో 85% సీట్లకు మమ్మల్ని అనర్హులుగా ప్రకటించడం చెల్లదు" అని కోర్టుకు వివరించారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావుల ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం తరపున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఎ.ప్రభాకర్‌రావు వాదనలను వినిపించారు. "ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ముగియడంతో.. తెలంగాణ లోకల్ ఏరియాగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ స్థానికులకు స్థానిక కోటా సీట్లు దక్కేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దాంతో రూల్స్ సవరించాం. తెలంగాణ శాశ్వత నివాసితులకే స్థానిక రిజర్వేషన్ దక్కడం రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయం" అని పేర్కొన్నారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. "ప్రభుత్వం సవరణ ద్వారా తీసుకొచ్చిన రూల్ 3(ఏ) ముఖ్యఉద్దేశం స్థానికులకు రిజర్వేషన్ కల్పించడం. ఈ నిబంధనను కొట్టివేస్తే.. తెలంగాణ రాష్ట్రంలో వైద్య విద్య ప్రవేశాలకు దేశంలోని ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా అర్హులవుతారు. ఇక్కడి శాశ్వత నివాసితులకు స్థానిక రిజర్వేషన్ దక్కకుండా పోతోంది. అందుకే.. ఈ నిబంధనను పునర్నిర్వచిస్తున్నాం. తెలంగాణ శాశ్వత నివాసులకు నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలన్న నిబంధన వర్తించదని అన్వయిస్తున్నాం.

## విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారం... హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వం లంచ్ మోషన్ పిటిషన్

**రూ.261 కోట్ల విద్యుత్ బకాయిల చెల్లింపుపై వివాదం**

**విద్యుత్ కొనుగోలు బిడ్‌లో డిస్కంలు పాల్గొనకుండా అడ్డుకున్న డిస్పాచ్ సెంటర్**

**దీంతో హైకోర్టును ఆశ్రయించిన రాష్ట్ర ప్రభుత్వం**

బీఆర్ఎస్ హయాంలో ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. బకాయిలు చెల్లించకపోవడంతో తెలంగాణ డిస్కమ్‌లు విద్యుత్ కొనుగోలు బిడ్‌లో పాల్గొనకుండా నేషనల్ డిస్పాచ్ సెంటర్ అడ్డుకుంది. రూ.261 కోట్ల బకాయిలు చెల్లించాలని పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో డిస్కమ్‌లను నేషనల్ డిస్పాచ్ సెంటర్ అడ్డుకుంది. విద్యుత్ కొనుగోలు బిడ్‌లో పాల్గొనకుండా అడ్డుకున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ట్రాన్స్‌కో-జెన్‌కో సీఎండీ రొనాల్డ్ రాస్ వాదనల కోసం హైకోర్టుకు వెళ్లారు. విద్యుత్ బకాయిల చెల్లింపులకు సంబంధించి చాలాకాలంగా వివాదం కొనసాగుతోంది. మరోవైపు, తెలంగాణ డిస్కమ్‌లు ఈ విషయమై సీఈఆర్సీని ఆశ్రయించాయి.

## రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదు

-మొదటిపేజీ తరువాయి

ఉన్న మహానాయకుడు ఏఐసీసీ అధ్యక్షుడిగా ఉన్నారని.. ఖర్గేను కలిసి ఆశీస్సులు తీసుకున్నానని అన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని కాంగ్రెస్ బలోపేతానికి పనిచేయాలని ఖర్గే సూచన చేశారన్నారు. కాంగ్రెస్ కార్యకర్త మొదలుకొని సీనియర్ నాయకులను కలుపుకొని వచ్చే ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన స్థానాలకంటే ఎక్కువ సాధించి మళ్ళీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయబోతున్నామన్నారు. మంత్రివర్గ విస్తరణ గురించి సీఎం, ఏఐసీసీ పెద్దలు మాట్లాడారని.. వారే నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కొత్త కమిటీ ఏర్పాటు అయ్యేంత వరకు పాత కమిటీలు పనిచేస్తాయన్నారు. బాధ్యతలు చేపట్టాక కొత్త కార్యవర్గంపై అధిష్టానంతో చర్చలు జరుపుతానని చెప్పారు. ప్రజలు నమ్మకంతో కాంగ్రెస్‌కు అధికారాన్ని ఇచ్చారని.. సమన్వయంతో పనిచేస్తున్నామని తెలిపారు. కమిటీల్లో అన్ని సామాజికవర్గాలకు సముచిత ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు సమయం ఇచ్చిందని... మరికొంతమంది పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కేటీఆర్ సవాళ్ళను పట్టించుకునే స్థితిలో లేరని... ప్రతిపక్ష పాత్ర ఇస్తే దాన్ని కూడా సమర్థవంతంగా నిర్వహించే స్థితిలో లేరని విమర్శించారు. వర్షాలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే కేసీఆర్, కేటీఆర్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. అలాగే అరికపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని.. సాంకేతికంగా ఆయనకు పీఏసీ చైర్మన్ ఇచ్చామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

## పట్టపగలే ఎమ్మెల్యేపై హత్యాయత్నామా




**హైదరాబాద్:** ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పట్టపగలే ఎమ్మెల్యేపై హత్యాయత్నామా అని ప్రశ్నించారు. మన రాష్ట్రం ఎటు పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్షన్, రౌడీ రాజకీయాలకు తెలంగాణను అడ్డాగా మార్చేస్తుంటే బాధగా ఉందన్నారు. కౌశిక్ రెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచి అరికెపూడి గాంధీ గూండాలతో దాడి చేయిస్తారా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమ్మెల్యేలకు కూడా రక్షణ లేకపోవడమేనా అని నిలదీశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై న్యాయపరంగా పోరాడుతున్నందునే కౌశిక్ రెడ్డిని టార్గెట్ చేశారన్నారు. ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయించిన దాడేనని ఆరోపించారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఇలాంటి ఉడుత ఊపుల దాడులకు బెదిరేది లేదని స్పష్టం చేశారు. ఇంతకు మించిన ప్రతిఘటన తప్పదంటూ కేటీఆర్ హెచ్చరించారు.

## రాహుల్ గాంధీ దేశాన్ని వదిలి వెళ్లిపోవాలి




**హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రజా పాలనపై కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్... రేవంత్ రెడ్డి సేమ్ టు సేమ్ అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి అస్సలు తేడా లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ దేశాన్ని వదిలి వెళ్లిపోవాలని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇటాలియన్ పార్టీ అని ఆరోపించారు. బండి సంజయ్ నేడు హైదరాబాద్‌లోని రాంగోపాల్‌పేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొత్త నాటకానికి తెరలేపారన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడే మాటలను దేశద్రోహ, సంఘ విద్రోహ శక్తులు సమర్థిస్తుంటాయని, ఇలా సమర్థించడం వెనుక ఆంతర్యం ఏమిటో చెప్పాలని నిలదీశారు. ఉగ్రవాద సంస్థలకు, రాహుల్ గాంధీకి ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు.
తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీల నుంచి దృష్టి మరల్చేందుకు హైడ్రా పేరుతో నాటకాలు ఆడుతోందని ఆరోపించారు. పేద ప్రజల పట్ల హైడ్రా వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. నాడు నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులు, ప్రభుత్వ యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి అస్సలు తేడా లేదని ఎద్దేవా చేశారు. సెప్టెంబర్ 17పై సీఎం రేవంత్ రెడ్డి మాట మార్చటం సిగ్గుచేటన్నారు. ఆరు గ్యారంటీలను డైవర్ట్ చేయటానికే హైడ్రా పేరుతో డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు.
ప్రజా పాలన దినోత్సవం కాదని... విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని డిమాండ్ చేశారు. రైతులను నడ్డి విరచటమే కాంగ్రెస్ ప్రజ పాలన అంటూ వ్యాఖ్యలు చేశారు. నిరుద్యోగులను మోసం చేయటమే కాంగ్రెస్ ప్రజాపాలన అని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొట్టుకోవటమే ప్రజా పాలన అని అన్నారు. విదేశాల్లో భారతదేశంపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. టెర్రరిస్టులతో రాహుల్ గాంధీకి సంబంధాలున్నాయని ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్ బీజేపీ కంట్రోల్‌లో ఉంటే 500 ఎంపీ సీట్లు గెలుచుకునేవాళ్ళమని తెలిపారు. సిక్కులను ఊచకోత కోసిందే రాహుల్ గాంధీ కుటుంబం అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ విరుచుకుపడ్డారు.

# పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు చేసిన వర్కింగ్ జర్నలిస్ట్టులు**

**చేవెళ్ల, శుభ తెలంగాణ:** నిబంధలనకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వర్కింగ్ జర్నలిస్టులు గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్ట్? శశాంక, జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావుకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల వర్కింగ్ జర్నలిస్ట్? మద్దెల సురేందర్ మాట్లాడుతూ.. అక్రెడిటేషన్ ఉన్న జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీపై 2024 జులై 15వ తేదీన జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావు ప్రొసీడింగ్‌ను విడుదల చేశారని తెలిపారు. ప్రొసీడింగ్ పత్రంతో పాటు అక్రెడిటేషన్ (జర్నలిస్ట్? గుర్తింపు కార్డును జోడించి) తన కుమారుడు చదువున్న చేవెళ్లలోని వివేకానంద ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో అందజేయగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వేణు కుమార్ దురుసుగా మాట్లాడరని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలో రూల్స్?? మాట్లాడితే పనులు జరగవని, ఎవరు సక్కగ పనిచేస్తున్నారని, కలెక్టర్, సంబంధిత శాఖ మంత్రి ఎవరూ సక్రమంగా పనిచేయడం లేదని ప్రిన్సిపాల్ మాట్లాడడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఈ విషయమై సెల్ ఫోన్‌లో రికార్డు చేసి కలెక్టర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తాననగా దిక్కున్నచోట చేసుకో అని అవమానకరంగా మాట్లాడడం బాధకలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పాఠశాల యాజమాన్యంపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరామని, దీనికి కలెక్టర్, డీఈవో సానుకూలంగా స్పందించారని వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కలెక్టర్, డీఈవోను కలిసిన వారిలో వర్కింగ్ జర్నలిస్టులు మద్దెల సురేందర్, ప్రవీణ్ కుమార్, స్థానికుడు సాయి తదితరులు ఉన్నారు.



# వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి...







**చేవెళ్ల ట్రాఫిక్ సిఐ వెంకటేశం**

**చేవెళ్ల, శుభ తెలంగాణ:** వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. గురువారం తమ సిబ్బందితో కలిసి శంకర్ పల్లి-హైదరాబాద్ వెళ్లే రోడ్డు , శంకర్‌పల్లి - చేవెళ్ల వెళ్లే రోడ్డు, శంకర్ పల్లి- తంగడపల్లి వయా పర్వేద వెళ్లే రోడ్డు పైన రోడ్డు ప్రమాదాలు జరగకుండా అన్ని యూటర్న్ వద్ద మరియు రోడ్డు మలుపుల వద్ద విలేజ్ గేట్ల వద్ద ట్రాఫిక్ బోలాడ్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు మూల మలుపుల వద్ద, గ్రామాల స్టేజీల వద్ద వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. వాహనదారులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకూడదని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్ కూడా తప్పనిసరి చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎస్సీ మహిళా నిరుద్యోగులు ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి...

-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్:, శుభ తెలంగాణ** ఎస్సీ మహిళా నిరుద్యోగులు ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. యస్.సి కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులైన షెడ్యూల్డు కులాల మహిళలకు కుట్టు మిషన్లతో ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తదనంతరం ఉచిత కుట్టు మిషన్ పంపిణీ ద్వారా స్వయం ఉపాధి కల్పనకు మంచి అవకాశం ఉంటుందని కలెక్టర్ అన్నారు. టైలరింగ్ శిక్షణకు కనీస విద్యార్హత 5వ తరగతి చదివి, వయస్సు 18 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాలు గల వికారాబాద్ జిల్లాలో నివసించే నిరుద్యోగ షెడ్యూల్డు కులాల మహిళలకు ఉచిత స్వయం ఉపాధికై 66 రోజుల ఉచిత టైలరింగ్ శిక్షణ వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ ప్రాంతాలలో ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. శిక్షణ కాలం పూర్తి అయిన తర్వాత ఉచిత కుట్టు మిషన్ మరియు సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు జిరాక్స్ పత్రాలైన ఆధార్ కార్డ్, కులం, ఆదాయం, విద్యార్హతలు, పాస్ ఫోటో సైజు (2) ఫోటోలతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, యస్.సి కార్పోరేషన్, రూమ్ నెం.12, రెండవ అంతస్తు కలెక్టరేట్ కార్యాలయం, వికారాబాద్ నందు సెప్టెంబర్ 20 లోగా సమర్పించాలని తెలిపారు.

# తుకారం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడి ఆత్మహత్య

**(శుభ తెలంగాణ /సికింద్రాబాద్),** 12 సెప్టెంబర్ 2024 తుకారాం గేట్ పరిధిలోని బుద్ధ నగర్ ప్రాంతంలో విషాద ఘటన చోటు చేసుకుంది.29 సంవత్సరాల గడ్డం అక్షయ్ కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు.అతని సోదరి కడారి దివ్యశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల ప్రకారం, కడారి దివ్యశ్రీ 12 సెప్టెంబర్ మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన తల్లి ఇంటికి గణేష్ మండపం వద్ద అన్నదానం కోసం వెళ్లింది. భోజనం అనంతరం,సుమారు సాయంత్రం 5:10 గంటల సమయంలో ఆమె తన తమ్ముడు అక్షయ్ కుమార్‌ను భోజనానికి పిలవడానికి ఫోన్ చేసింది,కానీ అతను స్పందించలేదు.దాంతో,ఆమె అతని గదికి వెళ్లి పిలిచింది,అయినా స్పందన రాకపోవడంతో కిటికీ ద్వారా చూడగా,అతను ఎరుపు-నలుపు రంగు చీరతో ఉరివేసుకుని ఉన్నట్టు గుర్తించింది. తక్షణమే, స్థానికులను, పిలిపించి, కే.నర్సింగ్,రోహిత్,సాయి కలిసి కత్తితో చీర కట్ చేసి, అక్షయ్‌ను కిందకు దింపారు.108అంబులెన్స్ సిబ్బందిని పిలిచినప్పటికీ, వారు వచ్చి అక్షయ్ మరణించాడని ధృవీకరిం చారు. మూడురోజులుగా మానసిక ఒత్తిడిలో ఉన్న అక్షయ్ తన తల్లి వైద్యపరమైన పరిస్థితిపై కలవరపడుతున్నాడని, భయంకరమైన విషయాలు మాట్లాడుతున్నాడని, కుటుంబసభ్యులు 11 సెప్టెంబర్ మౌలాలి దర్గా వద్దకు తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషాదకర ఘటనపై తుకారాం గేట్ పోలీసులు క్రైం నంబర్ 247/2024 కింద కేసు నమోదు చేసి, సీఐడీ అధికారుల ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ గా డి వెంకటేశ్వర్లు ఏఎస్ఐ ని నియమించినట్లుగా తుకారం గేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ మీడియా సమావేశంలో తెలిపారు.

## ఆర్టీసీ బస్సు బీభత్సం 54 ఏళ్ల మహిళకు గాయాలు

# కేసు నమోదు చేసిన తుకారంగేట్ పోలీసులు

**(శుభ తెలంగాణ/సికింద్రాబాద్)** తుకారంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్లుగడ్డ బావి సిగ్నల్ వద్ద రోడ్డు ప్రమాదంలో ఒక ఆర్టీసీ బస్సు నిర్లక్ష్యంగా నడిపిన కారణంగా 54 ఏళ్ల మహిళ తీవ్రంగా గాయపడ్డారు. బాధితురాలు లక్ష్మి భర్త సురేష్ సహా కుటుంబ సభ్యులు,స్థానికులు వెంటనే స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించగా,వైద్యులు ఆమె కుడికాలు కు,పలు ఎముకలు విరిగినట్లు నిర్ధారించారు.ఈ ఘటనపై తుకారంగేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వివరల్లోకి వెళితే బాధితురాలు లక్ష్మి (54) వయస్సు, భర్త సురేష్ తో కలిసి మల్కాజిగిరి పరిధిలోని వినాయక్ నగర్ సమీపంలో నివసిస్తున్నారు.ఆమె రోజువారీ కూలీగా పని చేస్తూ కుటుంబ పోషణ చేస్తుంది.సెప్టెంబర్ 11, 2024న, ఉదయం తన కూలీ పనులకు వెళ్లిన లక్ష్మి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తన పనులను ముగించుకుని నడుచుకుంటూ ఇంటికి తిరిగి వస్తుండగా,అల్లుగడ్డ బావి సిగ్నల్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది.ఆర్టీసీ బస్సు నంబర్ టీ ఎస్ 04జెడ్ 0186, సంగీత్ సిగ్నల్ నుండి అల్లుగడ్డ బావి సిగ్నల్ వైపు అత్యంత వేగంగా,నిర్లక్ష్యంగా వెళ్తూ,పాదచారుల దారిని గమనించకుండా నడిపిన డ్రైవర్ వల్ల,లక్ష్మి బస్సు కింద పడింది.ఈ దెబ్బకు ఆమె కుడి కాలుకి తీవ్ర గాయాలు అయ్యాయి.సంఘటనా స్థలంలో ఉన్న ప్రయాణికులు,బస్సు కండక్టర్ వెంటనే స్పందించి ఆమెను సమీపంలోని గాంధీ ఆసుపత్రి కి 108 అంబులెన్స్ ద్వారా తరలించారు.ఆసుపత్రికి చేరుకున్న వెంటనే డ్యూటీ డాక్టర్లు ఆమెకు చికిత్స అందించారు. వైద్యుల పరిశీలన ప్రకారం,ఆమె కుడి కాలుకి తీవ్రమైన పలు ఎముకలు ,విరిగినట్లుగా గాయాలు కనిపిస్తున్నాయని,తక్షణం శస్త్రచికిత్స అవసరం ఉందని తెలిపారు.ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ వైద్యులు గాయం తీవ్రతను గమనించి శస్త్రచికిత్స చేయాలని సిఫారసు చేశారు.ప్రస్తుతం ఆమెకు వైద్యం అందిస్తున్నారు.ఈ ఘటనపై బాధితురాలు లక్ష్మి తక్షణమే పోలీసులను ఆశ్రయించింది.తుకారంగేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని పీసీ-30016 ఎం.రతన్ కిశోర్ ఆమె ఫిర్యాదును నమోదు చేసారు.ఫిర్యాదులో ఆమె బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా,వేగంగా వాహనం నడిపి,తనకు గాయాలు కలిగించినందుకు బాధ్యత వహించాలని,మరియు అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది.అలాగే వెంటనే స్పందించిన పోలీసులు బస్సు నంబర్ టీ ఎస్ 04 జెడ్ 0186 డ్రైవర్ నిర్లక్ష్యం వలన ఈ ప్రమాదం జరిగింది అని.పోలీసులు ఈ డ్రైవర్ పై క్రైమ్ నెంబర్ 246/2024,అండర్ సెక్షన్ 125(ఏ ) బీ.ఎన్.ఎస్ క్రింద కేసు నమోదు చేశారు.బాధితురాలిని గాయపరిచినందుకు అతని నిర్లక్ష్య డ్రైవింగ్ పై పోలీస్ శాఖ దర్యాప్తు కొనసాగిస్తోంది అని.పోలీసులు డ్రైవర్ ని విచారణకు పిలిచి మరియు బస్సు డ్రైవింగ్ సమయంలో ఉన్న నిర్లక్ష్య పరిస్థితులను పరిశీలిస్తున్నామని తెలిపారు .


## వినాయక నిమర్జనాలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలి....

శంకర్ పల్లి సిఐ హబీబుల్లాఖాన్



**చేవెళ్ల, శుభ తెలంగాణ:** వినాయక నిమర్జనాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని శంకర్ పల్లి సిఐ హబీబుల్లాఖాన్ పేర్కొన్నారు. గురువారం శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని పత్తేపురం మూసి వాగు వద్ద వినాయక నిమర్జనాల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమర్జనం కోసం మూసి వాగు వద్ద ప్రత్యేక క్రేన్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మూసి వంతెనపై, వాగు వద్ద ఎల్ఈడి లైట్లు అమర్చడం జరిగిందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ విగ్రహాలను మూసి వరకు జాగ్రత్తగా తీసుకురావాలని సూచించారు. విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో భక్తులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, క్రేన్ ల ద్వారానే విగ్రహాలను నిమజ్జనం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సమయం లో భక్తులు భక్తి భావంతో శోభాయాత్రలో పాల్గొనాలని తెలిపారు. అనుమతులు లేకుండా డిజె సౌండ్ లను, స్పీకర్లను పెడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ రాములు, నాయకులు సాత ప్రవీణ్ కుమార్, కా శెట్టి చంద్రమోహన్, యాదయ్య గౌడ్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణనాథునికి పూజలు... చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, శుభ తెలంగాణ :** గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి విఠలేశ్వర ఆలయంలో కొలువుదీరిన గణేశునికి ఎమ్మెల్యే ఆలయ పూజారి రాజేశ్వర్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గజనాధుడి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం పూర్తిగా పండగ వాతావరణాన్ని తలపించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్లు వాణి ప్రకాష్, చంద్రమౌళి, లక్ష్మమ్మ రాంరెడ్డి, కాశెట్టి మోహన్, ఉప్పు సత్యం, ధనుంజయ్, ఉప్పు నర్సింలు, సూర్యం, సత్యనారాయణ, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 18 నుంచి డిఈఐఈడి పరీక్షలు...

**-జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుకా దేవి**



**వికారాబాద్, శుభ తెలంగాణ:** ఈనెల 18వ తేదీ నుండి నుండి డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయి. 18 నుండి 24వ తేదీ వరకు ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుకా దేవి తెలియజేశారు. వికారాబాద్ జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాయ్స్ వికారాబాద్ పాఠశాలలో సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగింది మిగతా వివరాల కోసం ఏసీజీ రామ్ రెడ్డి ని సంప్రదించాలని సూచించారు.

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి కీలక పదవి..




**హైదరాబాద్, శుభ తెలంగాణ:** ఆసియా-పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ ఛైర్మన్ గా టీడీపీ నేత, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎన్నికయ్యారు. ఢిల్లీలో జరుగుతున్న 2వ ఆసియా-పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ లో 40 దేశాల సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ దేశం తరఫున దక్కిన ఈ గౌరవాన్ని బాధ్యతగా స్వీకరిస్తానని తెలిపారు. విమానయాన రంగాన్ని ప్రజలకు మరింతగా అందుబాటులోకి తెచ్చేందుకు,సభ్యదేశాల మధ్య రవాణాను సులభతరం చేసేందుకు కృషిచేస్తానని వెల్లడించారు.

# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం...



**వికారాబాద్, శుభ తెలంగాణ:** అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అక్కడి సమావేశాల్లో భారత వ్యతిరేక వ్యక్తులు, శక్తులతో సమావేశం కావడాన్ని బిజెపి వికారాబాద్ శాఖ తీవ్రంగా ఖండిస్తూ అణువణువునా భారతదేశాన్ని వ్యతిరేకిస్తూ, విభేదిస్తూ, అవకాశం ఉన్నప్పుడల్లా భారతదేశంపై విషం చిమ్మే అమెరికా శాసనసభ్యురాలు, పాకిస్తాన్ సమర్థకురాలు ఇల్హాన్ ఒమర్‌తో రాహుల్ గాంధీ సమావేశమవ్వడాన్ని తప్పుబట్టారు. పరిస్థితులు అనుకూలిస్తే భారతదేశంలో రిజర్వేషన్లను రద్దు చేస్తామని రాహుల్ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. రిజర్వేషన్ల విషయంలో రాహుల్ గాంధీ అసలురంగు, కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. విదేశీ పర్యటనల్లో భారతదేశం పట్ల, భారతదేశ ప్రజాస్వామ్యం పట్ల, భారత ప్రజలను అవమానించేలా విమర్శలు చేయడం రాహుల్ గాంధీకి పరిపాటిగా మారిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్ సభ ఎన్నికల్లో ప్రజామోదంతో బిజెపి గెలుపొందితే.. ఆఖరుకు ప్రజల తీర్పును సైతం అవమానించేలా రాహుల్ మాట్లాడటం ప్రజాస్వామ్యాన్ని కించపర్చడమేనని తెలిపారు. బిజెపి అధికారంలో ఉన్నంతవరకు రిజర్వేషన్లను రద్దు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నెహ్రూ నుంచి మొదలు సామాజికంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు వ్యతిరేకించారని, రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించిన అంబేద్కర్ ను ఓడించిన దౌర్భాగ్య చరిత్ర కాంగ్రెస్ దేనని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కె.మాధవరెడ్డి మాట్లాడుతూ అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ భారతదేశం పట్ల, భారతదేశ ప్రజాస్వామ్యం పట్ల, భారత ప్రజలను అవమానించేలా విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తాను ప్రధానమంత్రి కాలేకపోతున్నాననే అక్కసుతో దేశం మీద విషం చిమ్మడం, భారతదేశం పట్ల చులకనగా మాట్లాడటం దుర్మార్గం. గత ఎన్నికలు సరిగ్గా జరగలేదని, బిజెపి గెలుపును తప్పుబట్టడం అంటే ప్రజాస్వామ్యంలో ఓటర్లను అవమానపర్చడమే. రాహుల్ వ్యాఖ్యలు సిగ్గుచేటు. కాంగ్రెస్ ఓడిపోయినంత మాత్రన ప్రజాస్వామ్యమే లేదని, దేశ ప్రతిష్టకు భంగం వాటిల్లే విధంగా ఇంగితజ్ఞానం కోల్పోయి మాట్లాడుతున్నాడు. రాహుల్ గాంధీ అసలు రంగు బయటపడింది. తన మనసులో మాట బయటపెట్టి రిజర్వేషన్ల రద్దుకు తెరలేపుతున్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ గారిపై, బిజెపిపై అక్కసుతో రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఫేక్ వీడియోలతో బిజెపి పై దుష్ప్రచారం చేసి లబ్ధి పొందే ప్రయత్నం చేసింది. బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్లు రద్దు చేస్తారని విషప్రచారం చేశారు. ఆనాడు భారత తొలి ప్రధాని నెహ్రూ గారు కులాల పేరుమీద రిజర్వేషన్లను విభేదించారు. భారతరాజ్యాంగాన్ని రచించి%ౕ% రిజర్వేషన్లు పొందుపర్చి ప్రపంచానికే దిక్సూచిగా నిలిచిన దివంగత భారతరత్న అంబేద్కర్ పై అక్కసుతో ఓడించిన చరిత్ర కాంగ్రెస్ ది. నెహ్రూ నుంచి మొదలు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వరకు పార్లమెంటులో మండల్ కమిషన్ ను విభేదించి, సామాజిక పరంగా కాకుండా కేవలం ఆర్థిక పరంగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. మండల్ కమిషన్ నివేదికను వ్యతిరేకించి, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీయే. పరిస్థితులు అనుకూలించినప్పుడు రిజర్వేషన్ల రద్దు చేస్తామని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడాన్ని వ్యతిరేకిస్తున్నాం. బీజేపీ ఉన్నంతకాలం రిజర్వేషన్లను ఎవరూ రద్దు చేయలేరని అమిత్ షా గారు స్పష్టంగా చెప్పారు. ప్రజా మద్దతుతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించింది. నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో పాలనాతీరును మెచ్చి బిజెపిలో చేరుతున్నారు. అణువణువునా భారతదేశాన్ని వ్యతిరేకిస్తూ, విభేదిస్తూ ఇల్హాన్ ఒమర్‌తో రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. గతంలో ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ మరణంపై భారత్–కెనడా మధ్య దౌత్య పరమైన వివాదం చెలరేగినప్పుడు ఇల్హాన్ ఒమర్ కెనిడియన్ దర్యాప్తునకు మద్దతివ్వాలని అమెరికాను కోరాడు. ఆర్టికల్ 370 ను వ్యతిరేకించడమే కాకుండా, హిందువులపై ద్వేషాన్ని పెంచడంలో కుట్రదారుతో రాహుల్ సమావేశమయ్యాడు. భారత్ ను వ్యతిరేకించే వ్యక్తులు, శక్తులతో రాహుల్ గాంధీ సమావేశం కావడాన్ని బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సిక్కులకు అస్తిత్వ ముప్పుకు కారణమై, వారి హక్కులను వ్యతిరేకించిన పాపం కాంగ్రెస్ ది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సిక్కుల ఊచకోత జరిగిందన్నారు. భారతదేశంలో సిక్కులు తలపాగా లేదా కడాను ధరించడంపై రాహుల్ వ్యాఖ్యలు సరికావు. విదేశీ పర్యటనల్లో భారతదేశంపై విషం చిమ్మేలా వ్యాఖ్యలు చేయడం రాహుల్ గాంధీకి పరిపాటిగా మారిందన్నారు. రాహుల్ గాంధీ చర్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా రేషన్ బియ్యం దందా



**కరీంనగర్, శుభ తెలంగాణ :** వరంగల్ కమిషనరేట్ పరిధిలో పీడీఎస్ రైస్ దందా జోరుగా నడుస్తోంది. రేషన్ షాపులతో పాటు లబ్ధిదా రుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేయడం, ఆ తరువాత ఎక్కువ రేటుతో ఇతర రాష్ట్రాలు, కోళ్ల ఫారాలకు తరలిస్తూ కొంతమంది దొడ్డిదారిన బిజినెస్ నడిపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ దందా ఎక్కువ కావడంతో వరంగల్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఈ అక్రమ దందా స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ మేరకు కమిషనరేట్ పరిధిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి రూ.13 లక్షల 41 వేల విలువైన 516 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రాంతంలో కొంతమంది పక్కదారి పట్టిస్తున్నారు. ఇలా అక్రమ దందా చేసే వారికి వర్ధన్నపేట శివారులోని మహేశ్వరి రైస్ మిల్ అడ్డాగా మారిందనే ఆరోపణలున్నాయి. వరంగల్ పోలీసులకు సమాచారం అందగా కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు బుధవారం స్పెషల్ రైడ్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరించి, వాహనాల్లో మహేశ్వరి మిల్కు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు వర్ధన్నపేట పోలీసుల సహాయంతో టాస్క్ ఫోర్స్ ఆఫీసర్లు తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న టీఎస్ 30 టీఏ1851 మహీంద్రా మినీ వాహనాన్ని పట్టుకోగా.. దాని డ్రైవర్ బాలు అనే యువకుడు పోలీసులు కండ్లు గప్పి పారిపోయాడు. అనంతరం మహేశ్వరి రైస్ మిల్లు ఓనర్ కొత్త రాజును అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత మిల్లును సోదా చెయ్యగా సుమారు 12 లక్షల 48 వేల విలువ గల 480 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. దీంతో బియ్యాన్ని సీజ్ చేసి, నిందితుడిని విచారణ నిమిత్తం వర్ధన్నపేట పోలీసులకు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కమిషనరేట్ వెస్ట్ జోన్ పరిధి అయిన జనగామలో బియ్యం దందా అడ్డూఆపు లేకుండా నడుస్తోందనే ఆరోపణలున్నాయి. జనగామ మార్కెట్ ప్రాంతానికి చెందిన రోకళ్ల నాగులు అనే వ్యక్తి రేషన్ బియ్యం దందా చేస్తున్నట్టుగా టాస్క్ ఫోర్స్ పోలీసులు అందగా.. బుధవారం ఉదయం ఆయన ఇంటిపై రైడ్ చేశారు. అక్కడ అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచగా.. టాస్క్ ఫోర్స్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడ స్టోర్ చేసి ఉన్న దాదాపు రూ.93 వేల 600 విలువైన 36 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు.

# ఉప ఎన్నికల సవాళ్లు...
# గెలుపుపై రెండు పార్టీల్లో ఆందోళన




**హైదరాబాద్, శుభ తెలంగాణ :** 2023 సంవత్సరం చివరి నెలలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అప్పటి అధికార భారత రాష్ట్ర సమితి ప్రతిపక్షానికి పరిమితం అయిపో యింది. అయితే భారత రాష్ట్ర సమితి నుంచి కొంతమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిలో స్టేషన్ ఘన్ పూర్, ఖైరతాబాద్, భద్రాచలం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు ఉన్నారు. అయితే వీరిపై అనర్హత వేటు విధించాలని భారత రాష్ట్ర సమితి హైకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు కీలక ఆదేశాలను జారీ చేసింది. ఫలితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలర్ట్ అయ్యారు. అంతేకాదు ఆయన ముందు ఉన్న ప్రత్యామ్నాయా లపై కసరత్తు మొదలుపెట్టారు. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే.. వాటికి సిద్ధం కావాలని నిర్ణయించారు. ఇప్పటికే పను నివేదిక లను అధ్యయనం చేస్తున్నారు. అయితే ఇదే సమయంలో మరొక విషయం కాంగ్రెస్ పార్టీ నాయకులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది..కోర్టు ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందనే చర్చ విస్తృతంగా జరుగుతోంది. భారత రాష్ట్రసంతి నుంచి పది మంది ఎమ్మెల్యేలు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విధించాలని భారత రాష్ట్ర సమితి స్పీకర్ కు ఫిర్యాదు చేసింది. అనంతరం హైకోర్టు తలుపు తట్టింది. నాలుగు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఈ సందర్భంగా ఆదేశాలు జారీ చేసింది. స్పీకర్ నిర్ణయం కీలకంగా మారింది. ఇక మిగతా ఎమ్మెల్యేలకు సంబంధించిన అనర్హత పిటిషన్లు స్పీకర్ వద్ద పెండింగ్లో ఉన్నాయి. అయితే ఈ విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై కాంగ్రెస్ పార్టీలో చర్చ నడుస్తోంది. ఒకవేళ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ లేదా అవసరమైతే సర్వోన్నత న్యాయస్థానం వరకు వెళ్తామని కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు చెబుతున్నారు. అయితే అక్కడ ఎలాంటి ఫలితం వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. అరవైపు 16 మంది ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకుంటే రాజకీయంగా రేవంత్ భారత రాష్ట్ర సమితిపై అప్పర్ హ్యాండ్ సాధించినట్లవుతుంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆ స్థాయిలో భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేర్తారనేది? ఒకింత సందేహమే. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే.. వాటికి ఎలా సన్నద్ధం కావాలనే దానిపై కాంగ్రెస్ పార్టీలో లోతుగా చర్చ నడుస్తున్నట్టు తెలుస్తోంది. ఏడాది పూర్తి కాకుండానే ఉప ఎన్నికలకు వెళ్తే ప్రజల స్పందన.. రాజకీయంగా పార్టీకి ఉన్న బలాలను రేవంత్ రెడ్డి పలు నివేదికల ద్వారా తెలుసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ ఉప ఎన్నికలు నిర్వహించడం ఖాయం అయితే పదిమంది ఎమ్మెల్యేల్లో కొంతమంది భారత రాష్ట్ర సమితికి తిరిగి వెళ్లే అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.. ఇప్పటికే ఎన్నికల హామీలు పూర్తి చేయకపోయినప్పటికీ.. చేస్తున్న వాటితో ప్రజల్లో సానుకూల దృక్పథం ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అంటున్నారు.. ఒకవేళ ఇప్పటికిప్పుడు ఎన్నికలకు వెళ్తే క్షేత్రస్థాయిలో ప్రతికూల ఫలితాలు వస్తాయనే ఆందోళన కూడా ఆ పార్టీ నేతలలో కనిపిస్తోంది. ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత.. హైకోర్టు తీర్పుపై ఎలా ముందుకు సాగుతారు? ? అనే విషయాలపై ఒక స్పష్టత వస్తుందని కాంగ్రెస్ పార్టీ కీలక నాయకులు చెబుతున్నారు.

## ముగ్గురిపై కత్తులతో దాడి

**సత్తెనపల్లి, శుభ తెలంగాణ :** సత్తెనపల్లి పట్టణంలో బుధవారం అర్ధరాత్రి ముగ్గురు యువకులపై కత్తులతో దాడి జరిగింది. పాత కక్షల నేపథ్యంలో ఘటన జరిగింది. వినాయక చవితి వేడుకల్లో నిమగ్నమైన వడవల్లికి చెందిన ముగ్గురు యువకులపై దాడి జరిగింది. దాడి చేసిన వ్యక్తులు మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో నివసిస్తున్న యువకులుగా గుర్తించారు. చిన్న వివాదం చిలికి చిలికి గాలి వానలా మారిన వైనం. తీవ్ర గాయాలైన కరాటే వెంకటేష్, పూర్ణ, రాజమంచి పవన్ కళ్యాణ్ కు సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని క్షతగాత్రుల తరపు బంధువులు ఆందోళన చేసారు. దాడి చేసిన వారిలో ఒకరి బైకును తగలబెట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను చెల్లాచెదురుచేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## రుణాల పేరిట రైతులను మోసం చేసిన సెక్రటరీ

**రైతుల పట్టా పాస్ బుక్ ల పై సుమారు కోటి వరకు రుణాలు**

**రికవరీ కోసం రైతుల ఇంటికి అధికారులు రావడంతో వెలుగులోకి వచ్చిన ఘటన..**

**నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా పడగల్ గ్రామ సహకార సంఘంలో ఐదు సంవత్సరాల క్రితం సెక్రటరీగా విధులు నిర్వహించి ప్రస్తుతం కొలీప్యాక్ లో విధులు నిర్వహిస్తున్న కొత్త దయాకర్ రైతుల వద్ద నుండి వారి అనుమతి లేకుండా పట్టా పాస్ బుక్ లపై క్రాప్ లోన్ తీసుకోవడం జరిగింది లోన్ రికవరీ అధికారులు రైతుల వద్దకు వచ్చి మీ భూమిపై లోన్ ఉందని కట్టని యెడల ఇంటిని వేలానికి వేస్తామని బెదిరించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది మోసపోయామని తెలిసిన బాధితులు పీఏసీసీ పడగల్ ముందర ధర్నా నిర్వహించారు రైతులను నట్టేట ముంచిన సెక్రెటరీ పై చర్యలు తీసుకునేంతవరకు ఉపేక్షించేది లేదని రైతుల భీష్మించుకు కూర్చున్నారు. మా భూములపై తీసుకున్న లోన్లను అధికారులు మాఫీ చేసి బాధితుల తరపున అండగా నిలబడాలని కోరుకున్నారు. పిఎసిసి కి చేరుకున్న విచారణ అధికారి మురళి బాధితుల వాంగ్మూలాన్ని సేకరించి విచారణ చేపడతామని తెలియజేశారు.

## అంజన్నను దర్శించుకున్న మహిళ అఘోర



**జగిత్యాల, శుభ తెలంగాణ :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజనేయ స్వామిని మహిళా అఘోర దర్శించుకున్నారు. లోక కళ్యాణం కోసమే ఆలయాల సందర్శన చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే కొండగట్టు శివారులో ఆశ్రమం ఏర్పాటు చేసి ప్రకృతి సేవ చేస్తానని మహిళ అఘోర వెల్లడించారు. మానవ సేవ కంటే ప్రకృతి సేవ చాలా గొప్పదని ఈ సందర్భంగా తెలిపారు. తాను వచ్చే మార్గమధ్యంలో వైకుంఠధామంలో పూజలు చేసినట్లు అలాగే పూజలు చేసిన ప్రాంతాన్ని మాత్రం వెల్లడించలేదు మహిళ అఘోర. ఆలయాల సందర్శన కోసం హరిద్వార్ నుండి వచ్చినట్లు తెలంగాణలోని ఆలయాలన్నింటిని సందర్శిస్తానని తెలిపారు.
ఆలయ అర్చకులు ఆమెకు సాదరంగా ఆహ్వానం పలికారు.

## బాన్సువాడలో తల్వార్‌తో దాడి కలకలం

**బాన్సువాడ :** బాన్సువాడ పట్టణంలోని తడ్కోల్ చౌరస్తా సమీపంలో మధురాలయ బార్ పరిసరాలలో బుధవారం తల్వార్ తో దాడి చేసిన సంఘటన కలకలం సృష్టించింది. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకుల మధ్య మాటకు మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా, సోను సింగ్ అనే యువకుడు ఆటో డ్రైవర్ సంజీవ్ పై తల్వార్ తో దాడి చేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు ఆటో డ్రైవర్ సంజీవును హుటాహుటీన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స ను అందించిన ఆసుపత్రి సిబ్బంది పరిస్థితి విషమంగా ఉండటం తో అక్కడి నుండి నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టుకు రంగం సిద్ధం ?

**ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటి ముందు భారీ బందోబస్తు!!**

**కౌశిక్ ఇంటి వద్ద ఉత్కంఠ**

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** హైదరాబాద్ లోని హుజురాబాద్ ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డి ఇంటి వద్ద గురువారం వేకువ జాము నుండి తీవ్ర ఉత్కంఠ ఉద్రిక్తత నెలకొంది. పెద్ద ఎత్తున పోలీసులను ఆయన ఇంటి వద్ద మోహరించారు. ఆయనను గృహనిర్బంధం చేసినట్టుగా తెలుస్తోంది. ఏ క్షణమైనా ఆయనను అరెస్టు చేయవచ్చని పోలీసు వర్గాల సమాచారం. ఇటీవల పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపై నాలుగు వారాల్లో చర్య తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేలపై వేటు వేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీలో చేరిన శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ తాను పార్టీ మారలేదని బిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని ప్రకటించిన విషయం తెలిసిందే. తాను గురువారం ఉదయం గాంధీ నివాసానికి వెళ్తానని ఆయన ఇంటిపై గులాబీ జెండా ఎగరవేసి అక్కడి నుండి తెలంగాణ భవన్ కి వచ్చి ప్రెస్ మీట్ పెడతానని కౌశిక్ బుధవారం సాయంత్రం ప్రకటించారు. ఈ నేపథ్యంలో గాంధీ ఇంటికి వెళ్లకుండా ఉండేందుకే కౌశిక్ రెడ్డి ఇంటి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల అనర్హతపై చర్య తీసుకోవాలంటూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి.

## హేమ డ్రగ్స్ తీసుకుంది...
## తేల్చి చెప్పిన పోలీసులు

**బెంగళూరు, శుభ తెలంగాణ :** బెంగళూరు ఎలక్ట్రానిక్స్ సిటీ సమీపంలోని ఫామ్‌హౌస్‌లో మే 15న నిర్వహించిన రేవ్ పార్టీపై దాడి చేసిన సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ ( సీసీబీ ) అధికారులు సోమవారం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నటి హేమ సహా ఇతర సినీ నటులు పాల్గొన్నారన్న ఆరోపణలతో.. ఈ రేవ్ పార్టీ కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో హాట్ టాపిక్ అయింది. వాసు అనే వ్యక్తి బర్త్ డేతో పాటు తన ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఈ పార్టీ ఏర్పాటు చేశాడు. కేసు దర్యాప్తును పోలీస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ లీడ్ చేశారు. తాజాగా ఆయన 1,086 పేజీల ఛార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు. అందులో నటి హేమ ఎండీఎంఏ సేవించిందని పేర్కొన్నారు. అందుకు సంబంధించి ఆమె వైద్య పరీక్ష ఫలితాలను జతపరిచారు. పార్టీకి హాజరైన మరో నటికి టెస్టులు చేయగా.. డ్రగ్స్ నెగెటివ్ వచ్చిందని.. ఆమె సాక్షుల్లో ఒకరిగా పరిగణిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీలో పట్టుబడిని తర్వాత హేమ చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. తాను అసలు ఆ పార్టీకే వెళ్లలేదని.. హైదరాబాద్‌లో ఉన్నట్లు వీడియో విడదుల చేసింది. తాను ఎలాంటి డ్రగ్స్ తీసుకోలేదని తెలిపింది. అయితే ఆమె మెడికల్ రిపోర్టు పాజిటివ్ అని తేలడంతో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఆపై ఆమె బెయిల్‌పై బయటకు వచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హేమ? వాసు, అరుణ్‌లకు ఫ్రెండ్. వారు ఆమెను పార్టీకి ఆహ్వానించారు. చార్జిషీట్‌లో మొత్తం 88 మందిని నిందితులుగా గుర్తించారు. వాసు, అతని స్నేహితులు చిత్తూరు జిల్లాకు చెందిన డెంటిస్ట్ రణధీర్ బాబు, కోరమంగళకు చెందిన అరుణ్ కుమార్, నాగబాబు, మహ్మద్ అబూబకర్, అగస్టిన్ దాదాగా గుర్తింపు పొందిన నైజీరియన్ దేశస్థుడ్ని పార్టీ ఆర్గనైజ్ చేసినందుకు, డ్రగ్స్ సప్లై చేసినందుకు నిందితులుగా చేర్చారు. హేమతో సహా మిగిలిన 79 మంది నిందితులపై ఎన్‌డిపిఎస్ చట్టం సెక్షన్ 27 (బి) ? (ఏదైనా మాదక ద్రవ్యం లేదా సైకోట్రోపిక్ పదార్థం సేవించినందుకు శిక్ష) కింద బుక్ చేశారు. సెక్షన్ ప్రకారం, నిందితులకు ఆరు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ. 10,000 వరకు జరిమానా శిధిస్తారు.

# టైగర్ నట్స్ ప్రయోజనాలు...

జీడిపప్పు, బాదం, పిస్తా, వాల్ నట్స్ ఇవి మాత్రమే తెలుసు. కానీ ఈ టైగర్ నట్స్ గురించి చాలా మందికి తెలియదు. ఇందులో మిగతా వాటికంటే ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయి. టైగర్ నట్స్ లో ఫైబర్, విటమిన్ ఇ, మినరల్స్ వంటి అనేక రకాల పోషకాలు ఉంటాయి. ఇవి మన శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ఇందులోని ఫైబర్ మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ గింజలను డైట్లో చేర్చుకుంటే జీర్ణక్రియ మెరుగ్గా ఉంటుంది. వీటిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. జీర్ణం కానీ ఆహారాన్ని సైతం జీర్ణం చేస్తుంది. ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువసేపు పొట్ట నిండిన అనుభూతి కలిగిస్తాయి. దీంతో బరువు తగ్గేందుకు ఉపయోగపడుతుంది. చక్కెర స్థాయిలను నియంత్రించటంలోనూ టైగర్ నట్స్ ఉపయోగపడతాయి. ఈ గింజల్లో ఉండే ఫైబర్ బ్లడ్ షుగర్ లెవల్స్ ను కంట్రోల్లో ఉంచుతుంది. ఫైబర్ పెద్ద ప్రేగులో చక్కెర శోషణను అడ్డుకుంటుంది. దీనివల్ల బ్లడ్ షుగర్ కంట్రోల్లో ఉంటుంది. టైగర్ గింజల్లో 18 రకాల అమైనో యాసిడ్స్ ఉంటాయి. గుడ్డుకు సమానంగా ప్రొటీన్ ఉంటుంది. వీటిని తింటే ఎముకలు బలంగా ఉంటాయి. వీటిని తీసుకోవటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. టైగర్ నట్స్ లో కాల్షియం అధికంగా ఉండటం వల్ల ఎముకలు బలంగా ఉండటానికి సహాయపడుతుంది. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడే ఆరోగ్యకరమైన కొవ్వులను కలిగి ఉంటాయి. టైగర్ నట్స్ లోని మోనో శాచురేటెడ్ కొవ్వు గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇందులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఇ పుష్కలంగా లభిస్తుంది. ఇవి కణాల ఆరోగ్యానికి సహాయపడతాయి. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి.



# ఆరోగ్యకరమైన ఎముకల కోసం




ఎండుద్రాక్ష అనేది ఒక రుచికరమైన, పోషకమైన ఎండిన పండు. దీనిని ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తినడానికి ఆనందిస్తారు. ఇవి విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇవి విస్తృత శ్రేణి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఎండుద్రాక్ష అనేది ఒక పోషకమైన, రుచికరమైన చిరుతిండి. ఇది అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. గుండె ఆరోగ్యం నుండి జీర్ణ ఆరోగ్యం వరకు ఎండు ద్రాక్షలోని విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు మొత్తం శ్రేయస్సును మెరుగుపరచడంలో సహాయపడతాయి. మీ ఆహారంలో ఎండుద్రాక్షను చేర్చడం మీ ఆరోగ్యాన్ని పెంచడానికి, అవి అందించే అనేక ప్రయోజనాలను ఆస్వాదించడానికి రుచికరమైన మార్గం. ఎండు ద్రాక్ష కొన్ని అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను చూద్దాం. పోషకాలు సమృద్ధిగా: ఎండుద్రాక్ష పోషకాలు అధికంగా ఉండే ఆహారం. అంటే అవి అవసరమైన విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉంటాయి. ఇవి ఫైబర్, పొటాషియం, ఐరన్, యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలం. ఈ పోషకాలు జీర్ణక్రియను మెరుగుపరచడానికి, గుండె ఆరోగ్యానికి తోడ్పడటానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. గుండె ఆరోగ్యం:ఎండుద్రాక్షలో అధిక స్థాయిలో ఉండే పొటాషియం రక్తపోటును తగ్గించడానికి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. పొటాషియం ఒక ముఖ్యమైన ఖనిజం. ఇది రక్తపోటును నియంత్రించడానికి, గుండె సరైన పనితీరును నిర్వహించడానికి సహాయపడుతుంది. ఎండుద్రాక్షను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. జీర్ణ ఆరోగ్యం: ఎండుద్రాక్షలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన జీర్ణ వ్యవస్థను నిర్వహించడానికి అవసరం. ఫైబర్ క్రమం తప్పకుండా ప్రేగు కదలికలను ప్రోత్సహించడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి అలాగే మొత్తం గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఎండుద్రాక్ష తినడం వల్ల జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇంకా ఉబ్బరం, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలను నివారించవచ్చు. యాంటీఆక్సిడెంట్ గుణాలు: ఎండుద్రాక్షలో యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి. ఫ్రీ రాడికల్స్ అనేవి వృద్ధాప్యం, వాపు, దీర్ఘకాలిక వ్యాధులకు దోహదపడే హానికరమైన అణువులు. ఎండుద్రాక్షలోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ ను తటస్తం చేయడానికి, ఆక్సీకరణ ఒత్తిడి ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి.

# జ్ఞాన దంతాలు తొలగించవచ్చా.. తొలగిస్తే ఏమవుతుంది?

చిన్న వయస్సులో దంతాలు రావడం, ఊడిపోవడం వంటివి జరుగుతుంటాయి. అప్పుడు పెద్దగా నొప్పి కూడా తెలీదు. చిన్నతనంలో పోయిన దంతాలు మళ్లీ వచ్చేస్తాయి. అయితే కొందరికి జ్ఞాన దంతాలు వస్తాయి. కానీ వీటిని తొలగించాలని కొందరు ప్రయత్నిస్తారు. అయితే మనలో చాలా మందికి జ్ఞాన దంతాలు అంటే ఏంటో తెలీదు. ఇవి ఉండటం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉండవు. చాలా మంది వీటిని అదృష్టం అని కూడా అనుకుంటారు. అయితే మరి ఇందులో నిజమేంతో తెలీదు. ఇంతకీ ఈ జ్ఞాన దంతాలు అంటే ఏమిటి? వీటిని తొలగించవచ్చా? తొలగిస్తే ఏమవుతుంది? సాధారణంగా దంతాలు చిన్నప్పటి నుంచి వస్తుంటాయి. అయితే మొదట వచ్చిన పాల దంతాలు ఉడిపోయి మళ్లీ వస్తాయి. ఈ దంతాలు కాకుండా 17 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల వరకు వచ్చే దంతాలను జ్ఞాన దంతాలు అంటారు. ఇవి వచ్చినప్పుడు కొందరికి చిగుళ్ల నొప్పులు వస్తాయి. ఆ దంతం దగ్గర ఏదయినా ఆహారం ఉండిపోయిన దవడ దగ్గర ఎక్కువగా నొప్పి వస్తుంది. దీంతో కొందరు ఈ జ్ఞాన దంతాలను తొలగించాలని అనుకుంటారు. కానీ వీటిని తొలగించవచ్చా? లేదా? తొలగిస్తే ఏమవుతుందని సందేహపడుతుంటారు. అయితే జ్ఞాన దంతాలను తొలగించవచ్చు. కాకపోతే వీటిని తొలగించినప్పుడు చాలా నొప్పిగా ఉంటుంది. జ్ఞాన దంతాలు ఉన్న దగ్గర చాలా మందికి ఆహారం ఇరుక్కుంటుంది. దీనిని వెంటనే తొలగించాలి. లేకపోతే జ్ఞాన దంతంతో పాటు దాని పక్కన ఉన్న దంతం కూడా పుచ్చి పోతుంది. కాబట్టి వెంటనే డాక్టర్ ను సంప్రదించి వీటిని తొలగించాలి. చాలా మందికి నోరు పొడిబారుతుంది. దవడలు నొప్పిగా ఉంటాయి. కనీసం ఆహారం కూడా మింగలేరు. మాట్లాడుతుంటే నాలుక పొడిగా ఉంటుంది. అయితే ఇవి ఎక్కువగా డయాబెటీస్ ఉన్న వాళ్లకి వస్తుందని నిపుణులు అంటున్నారు. క్యాన్సర్ వంటి వ్యాధులు ఉన్నవాళ్లు మందులు ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా నోరు పొడిబారుతుంది. కాబట్టి నీరు ఎక్కువగా తాగుతుండాలి. నోరు ఆరకుండా కొంచెం కొంచెం నీరు తాగుతుండాలి. మద్యం, ధుమపానం వంటి వాటికి దూరంగా ఉండాలి.




# పోషకాల సూపర్ ఫుడ్ కోసం



ఖర్జూరాలు శతాబ్దాలుగా ఆస్వాదించబడుతున్న రుచికరమైన, పోషకమైన పండు. సంతృప్తికరమైన రుచితో పాటు ఖర్జూరాలు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఇవి ఏ ఆహారానికైనా విలువైన అదనంగా ఉంటాయి. ఖర్జూరాలు ఒక రుచికరమైన పండు మాత్రమే కాదు. ఇవి అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. మీ ఆహారంలో ఖర్జూరాలను చేర్చడం జీర్ణక్రియను మెరుగుపరచడానికి, శక్తి స్థాయిలను పెంచడానికి, గుండె ఆరోగ్యానికి తోడ్పడటానికి, మొత్తం శ్రేయస్సును ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. స్మూతీలు, వోట్మీల్, సలాడ్లకు ఖర్జూరాలను జోడించడానికి ప్రయత్నించండి. పోషకమైన చిరుతిండి కోసం వాటిని స్వయంగా ఆస్వాదించండి. ఖర్జూరాలు పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ బి6 తో సహా అవసరమైన విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉంటాయి. ఈ పోషకాలు మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సును కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. శక్తి స్థాయిలు, గుండె ఆరోగ్యం, జీవక్రియకు సహాయపడతాయి. ఖర్జూరాలు డైటరీ ఫైబర్ అద్భుతమైన మూలం. ఇది జీర్ణ ఆరోగ్యానికి చాలా అవసరం. ఫైబర్ ప్రేగు కదలికలను నియంత్రించడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి, ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ను ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. ఖర్జూరాలను క్రమం తప్పకుండా తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇంకా అనేక జీర్ణ సమస్యలను నివారించవచ్చు. ఖర్జూరాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే సామర్థ్యానికి ప్రసిద్ధి చెందాయి. వీటిలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడానికి, హృదయ సంబంధ వ్యాధులను నివారించడానికి సహాయపడుతుంది. ఖర్జూరాలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మంటను తగ్గించడానికి, గుండెకు కలిగే నష్టం నుండి రక్షించడానికి సహాయపడతాయి.

# నెయిల్ పాలిష్ వేసుకుంటున్నారా?

చేతులు అందంగా కనిపించాలంటే నెయిల్ పాలిష్ ఉండాలి అనుకుంటారు. అందుకే నెయిల్ పాలిష్ వేసుకుంటారు. ప్రతి రంగు నెయిల్ పాలిష్ మార్కెట్లో లభిస్తుంది. దీంతో బట్టల కలర్ సహా కంప్లీట్ డ్రెసింగ్కు తగినట్టుగా నెయిల్ పాలిష్ వేసుకోవడానికి ఇష్టపడుతున్నారు మగువలు. డ్రెస్ ఎలా ఉంటే నెయిల్ పాలిష్ కూడా అదే విధంగా వేసుకుంటున్నారు. ఈ రోజుల్లో నెయిల్ ఆర్ట్కి చాలా క్రేజ్ వచ్చేసింది కూడా. రంగురంగుల పాలిష్ లు మాత్రమే కాదు డిజైన్ లు కూడా కోరుకుంటున్నారు. చిన్న చిన్న గోర్ల మీద మంచి మంచి డిజైన్ లు ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. కానీ నెయిల్ పాలిష్ మీ చేతులను అందంగా మారుస్తుందనేది ఎంత నిజమో.. మీకు అనారోగ్య సమస్యలను కూడా కలిగిస్తుందనేది అంతే నిజం అని మీకు తెలుసా.? అవును ఈ అందమైన నెయిల్ పాలిష్లలో ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. ఇందులో చాలా రసాయనాలు ఉంటాయి. నెయిల్ పాలిష్ ఉపయోగించడం ఆరోగ్యానికి హానికరం అంటున్నారు. నెయిల్ పాలిష్లో ఉండే రసాయనాలు ఆరోగ్యానికి చాలా హానికరం. వాటి నిరంతర, సుదీర్ఘమైన ఉపయోగం వల్ల అలెర్జీలు, వాపు, ఎరుపు వంటి చర్మ సమస్యలు వస్తాయి. నెయిల్ పాలిష్ రిమూవర్లను కూడా హానికరమైన రసాయనాలతో తయారు చేస్తున్నారని తెలుస్తోంది. వీటిని ఉపయోగించడం వల్ల చర్మం పొడిబారుతుంది. అంతేకాదు గరుకుగా కూడా మారుతుంది. చర్మం సహజ ఆయిల్, క్షీణత ఇన్ఫెక్షన్, బ్యాక్టీరియా వంటి ప్రమాదాలను పెంచుతుంది. శ్వాసకోశ సమస్యలు-నెయిల్ పాలిష్లో ఉండే రసాయనాలు శ్వాసకోశ సమస్యలను కలిగిస్తాయి. అందుకే నెయిల్ పాలిష్ వేసేటప్పుడు లేదా తొలగించేటప్పుడు మాస్క్ వేసుకోండి. నెయిల్ పాలిష్ లో ఉండే ట్రైఫినైల్ ఫాస్ఫేట్ ఊపిరితిత్తులకు హానికారం అంటున్నారు నిపుణులు. దీనివల్ల ఊపిరితిత్తులలో వాపు వస్తుంది. దీని కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వస్తుంది. ఆస్తమా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.



# దగ్గుకు ఈ సిరప్ వాడుతున్నారా..

వాతావరణం మారితే చాలు.. దగ్గు, జలుబు వంటివి వచ్చేస్తాయి. ఒక్కసారి దగ్గు వచ్చిందంటే మళ్లీ తగ్గడం చాలా కష్టం. దగ్గు తగ్గాలని కొందరు ఇంట్లోనే చిట్కాలు పాటిస్తారు. మరి కొందరు మందులు వాడుతారు. అయితే ఎక్కువ మంది దగ్గుకి సిరప్ వాడుతారు. సిరప్ వాడటం వల్ల తొందరగా దగ్గు తగ్గుతుందని భావిస్తారు. అయితే సిరప్ లు వాడటం వల్ల దగ్గు తగ్గుతుందో లేదో తెలీదు. కానీ ఇంకా అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దగ్గు, జ్వరం వంటివి వస్తే.. చాలా మంది డాక్టర్ ప్రమేయం లేకుండా మెడికల్ షాప్ కి వెళ్లి మందులు తెచ్చుకుంటారు. ఇలా కూడా వాడటం అంత మంచిది కాదని వైద్యులు అంటున్నారు. అయితే మార్కెట్ లో చాలా నకిలీ మందులు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆహార పదార్థాలు అన్నిటిలో కూడా కల్తీ అవుతుంది. ఇప్పుడు ఆరోగ్యాన్ని కాపాడే మందుల్లో కూడా కల్తీ అవుతుంది. వీటిని తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే ఇటీవల హైదరాబాద్ లో నకిలీ దగ్గు మందు తయారుచేస్తున్న వాళ్లను ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేసారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా దగ్గు సిరప్ చేస్తున్న వాళ్లపై అధికారులు సీజ్ చేశారు. కూకట్పల్లిలో అఖిల్ లైఫ్ సైన్సెస్ అనే కంపెనీ గ్లైకోరిల్ దగ్గు సిరప్ అనే పేరుతో ఈ మందును తయారు చేస్తున్నారు. ఈ దగ్గు మందులో ఎలాంటి క్వాలిటీ లేవని అధికారులు చెబుతున్నారు. అయితే ఇలాంటి క్వాలిటీ లేని సిరప్ ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని అధికారులు తెలిపారు. ఈ సిరప్ ను ప్రజలు వాడవద్దని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.



Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110